www.prajanaava.in

ప్రజానావ

Telugu Daily

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే

- చైనా అభ్యంతరాలపై భారత్ స్పష్టీకరణ
- లద్దాఖ్‌లో 28 కీలక ప్రాంతాలకు అధికారిక పేర్ల ఖరారు
- విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్



2

Published from: Hyderabad, Karimnagar, Rangareddy Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 66 | బుధవారం | 14 అక్టోబర్, 2026



ఉగ్రవాదంపై భారత్ వెనక్కి తగ్గదు

వారికి ఆశ్రయం లేకుండా చూడాలి

నిధుల సరఫరాను అడ్డుకోవాలి

2

బీఐఎంఎస్‌టీఈసీ దేశాలకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా పిలుపు



ఉగ్రవాదంపై పోరులో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు.

మాతోనే దేశ ప్రజలు

ప్రజాస్వామ్య పరిరక్షణకు విపక్షాల ఐక్యపోరాటం

- ఓటు చోరీకి బాధ్యులైన వారిని కోర్టు ముందు నిలబెట్టడమే లక్ష్యం
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఆందోళనలు
- విపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులతో రాహుల్ భేటీ

మేమంతా ఇక్కడ ఏకతాటిపై, ఒక్కటిగా నిలబడి ఉన్నాం. నేను సోమవారం చెప్పినట్లు నమాంతరంగా నిరసనలు ఏమీ లేవు. అది ఒకే ఒక్క నిరసన. ఆ నిరసన లక్ష్యం కూడా ఒకటే. దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించటం. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థలు నాశమయ్యాయి. నిజమైన ప్రజాస్వామ్య పాలన పునరుద్ధరణకు మేమంతా కలిసి పోరాటం చేస్తున్నాం.

-లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ





న్యూఢిల్లీ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించేందుకు ప్రతిపక్షాలు, విద్యార్థి, పౌర సంఘాలు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేస్తున్నాయని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తెలిపారు. తన నివాసంలో ఇండియా కూటమి నేతలు, విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులకు ఆయన తేనీటి విందు ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, ఓటు చోరీకి బాధ్యులని తాము ఆరోపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌లను కోర్టు ముందు నిలబెట్టడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో ప్రజాస్వామ్యం, ఎన్నికల వ్యవస్థలు దెబ్బతిన్నాయని రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య పాలనను పునరుద్ధరించేందుకు విపక్షాలన్నీ కలిసికట్టుగా పోరాడుతున్నాయని చెప్పారు. ఈ విషయంలో సుప్రీంకోర్టు, ప్రధాన న్యాయమూర్తిపై తమకు పూర్తి గౌరవం ఉందని, న్యాయవ్యవస్థ తన బాధ్యతను నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నామని తెలిపారు.

హక్కులను హరించే ప్రయత్నాలు

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అనుమతించే ప్రదేశాన్ని డీనోటిఫై చేయడాన్ని రాహుల్ గాంధీ ఖండించారు. నిరసన తెలిపే హక్కును హరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు.

దేశ భవిష్యత్తు కోసమే పోరాటం

దేశ భవిష్యత్తు కోసమే తాము పోరాడుతున్నామని, సోమవారం ఢిల్లీ వీధుల్లో నిర్వహించిన నిరసనల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెప్పారు. ఆందోళనలకు మద్దతు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఓటు చోరీకి ఎవరు బాధ్యులైనా శిక్ష అనుభవించాల్సిందేనని రాహుల్ స్పష్టం చేశారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు నిరసనలు కొనసాగిస్తామని ప్రకటించారు. తమది వేర్వేరు ఆందోళనల సమాహారం కాదని, ప్రజాస్వామ్య పునరుద్ధరణే లక్ష్యంగా సాగుతున్న ఒకే ఉద్యమమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, శశిథరూర్, పవన్ ఖేరాతోపాటు ఆర్జేడీ నేతలు తేజస్వీ యాదవ్, మనోజ్ ఝా, టీఎంసీ నేత మహువా మొయిత్రా, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. విద్యార్థి, పౌర సంఘాల ప్రతినిధులు హాజరై సంఘీభావం తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై విచారణ జరిపించాలని, సర్ ప్రక్రియను నిలిపివేయాలని, ఈసీ జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని ఇండియా కూటమి నేతలు డిమాండ్ చేశారు.

2029లోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు



- ఎస్ఐఆర్ పేరుతో అబద్ధపు ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు
- చొరబాటుదారులకు రక్షణ కల్పించే వ్యూహాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారు
- రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలపై అమిత్ షా ఫైర్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రతిపక్షాలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీకి లభిస్తున్న ప్రజాదరణను జీర్ణించుకోలేక ప్రతిపక్షాలు ఎస్ఐఆర్ (ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ) పేరుతో అబద్ధపు ప్రచారానికి దిగుతున్నాయని ఆరోపించారు. ఈ విధానం ముసుగులో చొరబాటుదారులకు ఓటర్లుగా నమోదు చేసుకునే అవకాశం కల్పించాలన్న వ్యూహాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లోనూ ఎన్డీఏ కూటమి భారీ మెజారిటీతో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, మోదీ విజయాలను ఎన్నికల ప్రక్రియకు ఆపాదించి కొట్టిపారేయడం మానుకుని, కాంగ్రెస్ తన వైఫల్యాలపై తరువాయి 2లో..

విదేశీ శక్తులతో కమ్యూనిస్టుల కుట్ర

2



- దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్లాన్
- నిరసనలతో ఢిల్లీ వ్యాపారాలకు నష్టం
- రాజ్యాంగ సంస్థలను లక్ష్యంగా చేసుకోవడం సరికాదు
- కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

ప్రభుత్వ పాఠశాలల సరఫరా టెండర్లు రద్దు చేయాలి



- పాత విధానంలోనే అవకాశం కల్పించాలి
- పీఎంయూ టెండర్లపై హరీశ్‌రావు అభ్యంతరం
- స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన

2

ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలపై నిర్లక్ష్యం వద్దు

- ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు అప్రమత్తంగా ఉండాలి
- మంత్రులు, ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- కరవు, విద్యుత్ కొరతపైనా నేతలతో సమీక్ష

న్యూఢిల్లీ: తెలంగాణలో రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోవడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ పార్టీ నేతలకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికలను తేలికగా తీసుకోవద్దని, ఓటర్ల నమోదు నుంచి పోలింగ్ వరకు ప్రతి దశపైనా ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు. ఢిల్లీలోని తన నివాసంలో అందుబాటులో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలతో సీఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. గంటకు పైగా సాగిన ఈ భేటీలో ఎమ్మెల్సీ ఎన్నికలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, విద్యుత్ కొరత తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది.

రెండు స్థానాలే లక్ష్యం

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం మంత్రులు, ఎమ్మెల్యేలు తమ పరిధిలో సమన్వయంతో పనిచేయాలని సీఎం సూచించారు. ఓటర్ల నమోదు ప్రక్రియను పర్యవేక్షించడంతో పాటు పట్టభద్రులను కలిసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియను ఆషా మాషీగా తీసుకోకుండా, ఇప్పటి నుంచే పక్కా కార్యాచరణతో ముందుకు సాగాలని తరువాయి 2లో..





భారత్ ఆర్థిక వృద్ధి చైనా కంటే మెరుగ్గా ఉంది

- ప్రజా సాధికారతే లక్ష్యం

ప్రస్తుతం దేశ వృద్ధిరేటు 7శాతం

- పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానం
- డిజిటల్ నైపుణ్యాలే ఆర్థిక ప్రగతికి చోదకశక్తి
- బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో ప్రధాని

భారత్ ఆర్థిక వృద్ధిరేటు చైనా కంటే మెరుగ్గా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వృద్ధిరేటు 7శాతంగా ఉందని వెల్లడించారు. భవిష్యత్తులో పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

2

కేంద్రమంత్రి మురుగన్ రాజీనామా

- తమిళనాడులో బీజేపీ బలోపేతమే లక్ష్యం
- రాజ్యసభ సభ్యత్వానికీ రాజీనామా చేస్తానని వెల్లడి
- 2029 ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకే నిర్ణయం

చెన్నై: తమిళనాడులో భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసేందుకు రాష్ట్రానికి తిరిగి వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ తెలిపారు. ఈ నేపథ్యంలో తన మంత్రి పదవితోపాటు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ తరువాయి 2లో..



రహదారి ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ కారిడార్‌కు గ్రీన్‌సిగ్నల్

- కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికీ అంగీకారం
- 5 రోప్‌వేలు, 3 ఆర్‌వోబీలకు అనుమతులు
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి భేటీ



2

2029లోనూ కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

ఆత్మపరిశీలన చేసుకోవాలని అమిత్ షా సూచించారు. ఒకప్పుడు సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న గుజరాత్‌లో గత 41 ఏళ్లుగా కాంగ్రెస్ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేకపోయిందని పేర్కొన్నారు. ఇటీవల మూడు రాష్ట్రాల్లో జరిగిన ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఒక్క సీటు గెలుచుకోలేకపోయిందని విమర్శించారు. ఎన్నికల్లో ఓటములకు ఎన్నికల సంఘాన్ని బాధ్యురాలిగా చూపుతూ, బ్యాలెట్ పేపర్ల వినియోగాన్ని మళ్లీ తెరపైకి తీసుకురావడాన్ని అమిత్ షా తప్పుబట్టారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారానే కాంగ్రెస్ గతంలో పలు రాష్ట్రాల్లో విజయం సాధించిందని గుర్తుచేశారు. మీడియా దృష్టిని ఆకర్షించేందుకు కల్పిత ప్రచారాలు, నిరంతర ఆరోపణలు చేస్తున్నంత మాత్రాన ప్రజల విశ్వాసాన్ని పొందలేరని వ్యాఖ్యానించారు. ఎస్ఐఆర్ పేరుతో చొరబాటుదారులకు రక్షణ కల్పించే ప్రయత్నాలను ప్రజలు ఇకపై అంగీకరించరని అమిత్ షా అన్నారు. రాహుల్ గాంధీ, ఆయన మిత్రపక్షాలు వరుసగా నాలుగో ఓటమిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు మోదీ, బీజేపీ, ఎన్డీఏకు మద్దతుగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఉపఎన్నికల ఫలితాలను ప్రస్తావిస్తూ, అసోంలోని నౌగావ్‌లో బీజేపీ అభ్యర్థి భారీ మెజారిటీతో విజయం సాధించారని, పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, రెజినగర్ స్థానాల్లోనూ బీజేపీ అభ్యర్థులు గెలుపొందారని అమిత్ షా తెలిపారు. పుదుచ్చేరిలో ఎన్డీఏ మిత్రపక్షమైన ఏఐఎన్ఆర్‌సీ అభ్యర్థి విజయం సాధించగా, కాంగ్రెస్‌కు తక్కువ ఓట్లు మాత్రమే లభించాయని పేర్కొన్నారు. ఈ ఫలితాలు ప్రతిపక్షాలు తమ రాజకీయ వ్యూహాలను పునఃసమీక్షించుకోవాల్సిన అవసరాన్ని సూచిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

ప్రభుత్వ పాఠశాలల సరఫరా టెండర్లు రద్దు చేయాలి

ప్రజానావ,హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలకు సరుకుల సరఫరా కోసం ప్రవేశపెట్టిన ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ (పీఎంయూ) టెండర్లను తక్షణమే రద్దు చేయాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఈ నూతన విధానం వల్ల స్థానిక చిరు వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారని ఆయన ఆరోపించారు. గతంలో అమలులో ఉన్న విధానాన్నే కొనసాగిస్తూ, పాఠశాలను ఒక యూనిట్‌గా పరిగణించి జిల్లా కొనుగోలు కమిటీ (డీపీసీ) ద్వారా స్థానిక వ్యాపారులకు సరఫరా బాధ్యతలు అప్పగించాలని కోరారు. స్థానిక వ్యాపారులకు అవకాశం కల్పించడం ద్వారా వారి ఉపాధికి భరోసా లభించడంతోపాటు విద్యార్థులకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందుతాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. స్థానిక వ్యాపారులను పక్కనపెట్టి, ఒకే సంస్థకు టెండర్లు అప్పగించడం వెనుక కమీషన్ల ప్రయోజనాలు ఉన్నాయని విమర్శిం చారు. ఇప్పటికే బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న సంస్థకు టెండర్లు కట్టబెట్టడం కమీషన్ల కోసం చేస్తున్న దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని పునఃసమీక్షించి, పాత సరఫరా విధానాన్ని పునరుద్ధరించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

శంషాబాద్ విమానాశ్రయంలో రూ.2.71 కోట్ల గంజాయి పట్టివేత

- ఎలక్ట్రిక్ గీజర్‌లో దాచి తరలింపు
- 7.750 కిలోల హైడ్రోపోనిక్ గంజాయి స్వాధీనం
- బ్యాంకాక్ నుంచి వచ్చిన ప్రయాణికుడి అరెస్ట్



ప్రజానావ, హైదరాబాద్: శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీ మొత్తంలో హైడ్రోపోనిక్ గంజాయిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎలక్ట్రిక్ గీజర్‌లో దాచి అక్రమంగా తరలిస్తున్న 7.750 కిలోల గంజాయిని పట్టుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో దీని విలువ సుమారు రూ.2.71 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన డీఆర్ఐ హైదరాబాద్ జోనల్ యూనిట్ అధికారులు, అక్టోబర్ 12న బ్యాంకాక్ నుంచి వచ్చిన విమానంలో ప్రయాణించిన ఓ భారతీయుడిని తనిఖీ చేశారు. అతని చెక్–ఇన్ బ్యాగేజీలో ఉన్న ఎలక్ట్రిక్ గీజర్‌పై అనుమానం రావడంతో దాన్ని తెరిచి పరిశీలించారు. అందులో 73 ప్యాకెట్లలో దాచి ఉంచిన పచ్చని పదార్థాన్ని గుర్తించారు. నార్కోటిక్ డ్రగ్స్ డిటెక్షన్ కిట్‌తో పరీక్షించగా, అది గంజాయిగా నిర్ధారణ అయింది. దీంతో నిందితుడిని నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్‌స్టాన్సెస్ (ఎన్‌డీపీఎస్) చట్టం – 1985 కింద అరెస్ట్ చేసి, గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అంతర్జాతీయ మార్గాల ద్వారా హైదరాబాద్‌కు అధిక నాణ్యత గల గంజాయిని అక్రమంగా తరలించడాన్ని అడ్డుకునే చర్యల్లో భాగంగా ఈ పట్టివేత జరిగినట్లు అధికారులు తెలిపారు. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో నిందితుడి వివరాలను వెల్లడించలేదు.

పద్మ అవార్డులతో సీఈఓలకు కాంగ్రెస్ ప్రయోజనాలు

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- మాజీ ఎన్నికల కమిషనర్లకు రాజకీయ పదవులు ఇచ్చారని ఆరోపణ



న్యూఢిల్లీ: మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్లకు పదవీ విరమణ తర్వాత రాజకీయ పదవులు, పద్మ అవార్డులు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రయోజనం చేకూర్చిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్న నేపథ్యంలో మంగళవారం దిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆయన, కాంగ్రెస్ పార్టీ గతంలో వ్యవహరించిన తీరుపై విమర్శలు చేశారు. ఎన్నికల కమిషనర్లుగా పనిచేసిన కొందరికి పదవీ విరమణ అనంతరం రాజకీయ పదవులు, పురస్కారాలు ఇచ్చారని గోయల్ పేర్కొన్నారు. మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎం.ఎస్. గిల్‌కు పద్మవిభూషణ్ ఇచ్చారని, ఆర్.కె. త్రివేదిని 1986లో గుజరాత్ గవర్నర్‌గా నియమించారని గుర్తుచేశారు. మాజీ సీఈసీ టి.ఎన్. శేషన్‌ను ఎల్.కె. అడ్వాణీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో నిలబెట్టారని ఆరోపించారు. రాహుల్ గాంధీ వ్యవహారశైలిపై కూడా విమర్శలు చేశారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరపకుండానే ఎన్నికల కమిషనర్ల నియామకాలు చేపట్టేదని గోయల్ అన్నారు. ఈ విధానానికి భిన్నంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం 2023లో కొత్త చట్టాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. ఈ చట్టం ప్రకారం ఎన్నికల కమిషనర్ల ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేతకు కూడా స్థానం కల్పించినట్లు వివరించారు. అయితే, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషనర్లకు పద్మ అవార్డులను లంచంగా ఇచ్చిందన్న గోయల్ ఆరోపణలు ఆయన చేసిన రాజకీయ వ్యాఖ్యలుగా పేర్కొనాల్సి ఉంది.

ఉగ్రవాదంపై భారత్ వెనక్కి తగ్గదు



న్యూఢిల్లీ: ఉగ్రవాదంపై పోరులో భారత్ ఎప్పుడూ వెనక్కి తగ్గదని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఏమాత్రం సహించని విధానాన్ని అనుసరిస్తున్నామని తెలిపారు. బీఐఎంఎసస్‌టీఈసీ దేశాల్లో ఉగ్రవాదులకు ఆశ్రయం దొరకకుండా సభ్య దేశాలన్నీ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను దాచడం, వారికి శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం వంటి కార్యకలాపాలకు ఈ ప్రాంతంలో ఎలాంటి అవకాశం ఉండకూడదని చెప్పారు. దిల్లీలో మంగళవారం జరిగిన తొలి బిమ్‌స్టెక్ దేశాల హోంమంత్రుల సమావేశంలో అమిత్ షా మాట్లాడారు. సభ్య దేశాల మధ్య పరస్పర నమ్మకం, సహకారం ఉంటేనే ప్రాంతీయ భద్రతను మరింత బలోపేతం చేయగలమని తెలిపారు. ఒక దేశ భద్రతా వ్యవస్థ మరో దేశ భద్రతకు కూడా ఉపయోగపడేలా పనిచేయాలని సూచించారు. ఉగ్రవాదం వంటి సమస్యలను ఎదుర్కోవడంలో అన్ని దేశాలు ఒకే లక్ష్యంతో ముందుకు సాగాలని చెప్పారు.

ఉగ్రవాదులు ఒక దేశం నుంచి మరో దేశానికి వెళ్లి దాక్కోవడం, అక్కడ స్థావరాలు ఏర్పాటు చేసుకోవడం, కొత్తవారిని నియమించుకోవడం, శిక్షణ ఇవ్వడం వంటి వాటిని అడ్డుకోవాలని అమిత్ షా అన్నారు. పొరుగు దేశాలపై దాడులకు ప్రణాళికలు వేయడం, వాటి కోసం వనరులను సమకూర్చుకోవడం వంటి చర్యలకు కూడా అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఉగ్రవాదం ఒక దేశానికే పరిమితమైన సమస్య కాదని, దాని ప్రభావం అనేక దేశాలపై ఉంటుందని ఆయన వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. అందువల్ల ప్రతి దేశం తన భద్రతను మాత్రమే కాకుండా, ఇతర సభ్య దేశాల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఉగ్రవాదులను, వారి సహాయకులను గుర్తించేందుకు సభ్య దేశాల మధ్య సమాచార మార్పిడి పెరగాలని అమిత్ షా చెప్పారు. ఉగ్రవాదుల వివరాలు, వారికి సహకరించే వ్యక్తులు, నేర ముఠాలు, వారి ఆర్థిక లావాదేవీలు, సరిహద్దులు దాటి జరిగే కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని సకాలంలో పంచుకోవాలని సూచించారు. ఇప్పటికే ఉన్న సంబంధిత సంస్థల ద్వారా ఈ సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడం వల్ల ఉగ్రవాదంపై పోరును మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.ఉగ్రవాదాన్ని అడ్డుకోవడంతోపాటు, దానికి అందుతున్న ఆర్థిక సహాయాన్ని నిలిపివేయడం కూడా ముఖ్యమని అమిత్ షా పేర్కొన్నారు. ఉగ్రవాదానికి నిధులు సమకూర్చే మార్గాలను గుర్తించి, వాటిని అడ్డుకోవాలని సభ్య దేశాలకు సూచించారు. వ్యవస్థీకృత నేరాలకు పాల్పడే ముఠాలపై కూడా కలిసి చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేరాలకు పాల్పడిన వ్యక్తులను చట్టం ముందు నిలబెట్టేందుకు సభ్య దేశాలు పరస్పరం సహకరించుకోవాలని అన్నారు. ఆయా దేశాల చట్టాలు, కుదుర్చుకున్న ఒప్పందాలకు అనుగుణంగా న్యాయపరమైన సహాయం అందించుకోవడం, నిందితులను అప్పగించే విషయంలో సహకరించడం అవసరమని వివరించారు. ఇలాంటి చర్యల వల్ల నేరగాళ్లను పట్టుకోవడం సులభమవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా మరో పెద్ద సమస్యగా మారిందని అమిత్ షా చెప్పారు. ఈ అక్రమ రవాణాను ఒక్క దేశం మాత్రమే అడ్డుకోలేదని, అన్ని దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ వ్యాపారం ద్వారా వచ్చే డబ్బు నేర ముఠాలకు బలాన్ని ఇస్తోందని, అదే డబ్బును ఉగ్రవాద కార్యకలాపాలకు కూడా ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల తయారీలో ఉపయోగించే రసాయనాలను అక్రమంగా మళ్లించడం, డార్క్ వెబ్ ద్వారా లావాదేవీలు జరపడం వంటి చర్యల వల్ల ఈ సమస్య మరింత క్లిష్టంగా మారుతోందని చెప్పారు. ఈ సమస్యలను ఎదుర్కోవడానికి ఒక్కో దేశం విడివిడిగా ప్రయత్నించడం కాకుండా, మొత్తం ప్రాంతం ఒకటిగా భావించి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉగ్రవాదం, నేర ముఠాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి సమస్యలపై ఉమ్మడి కార్యాచరణ అవసరమని స్పష్టం చేశారు.

కేంద్రమంత్రి పదవికి మురుగన్ రాజీనామా

(మొదటి పేజీ తరువాయి)



రాసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన సమాచార, ప్రసార శాఖతోపాటు పార్లమెంటరీ వ్యవహారాల శాఖలో సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తమిళనాడులో పార్టీని బలోపేతం చేసి, 2029 సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం చేయడమే తన లక్ష్యమని మురుగన్ పేర్కొన్నారు. మంత్రి బాధ్యతల నుంచి తనను తప్పించి, పార్టీ కోసం పనిచేసే అవకాశం కల్పించాలని ప్రధానిని కోరినట్లు తెలిపారు. ఇటీవల తమిళనాడులో ప్రధాని మోదీ పర్యటించిన సందర్భంగా ఆయనకు ప్రజల నుంచి లభించిన ఆదరణను ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. తమిళుల ఆత్మగౌరవాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లేందుకు మోదీ కృషి చేస్తున్నారని ప్రశంసించారు. ప్రధాని నాయకత్వంలో పనిచేయడం తనకు గొప్ప గౌరవమని మురుగన్ పేర్కొన్నారు. దేశం, తమిళనాడు, బీజేపీ పట్ల తనకున్న అంకితభావం మరింత పెరిగిందని తెలిపారు. మోదీ నాయకత్వంలో దేశానికి, తమిళనాడుకు సేవ చేయడాన్ని తన జీవితంలో లభించిన అత్యంత గొప్ప అవకాశంగా భావిస్తున్నట్లు వెల్లడించారు. పెట్రోలియం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న హర్దీప్ సింగ్ పూరీని రాజ్యసభకు నామినేట్ చేయకపోవడంపై చర్చ జరుగుతున్న సమయంలో మురుగన్ రాజీనామా ప్రకటన వెలువడటం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

భారత్ ఆర్థిక వృద్ధి చైనా కంటే మెరుగ్గా ఉంది



న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వృద్ధిరేటు చైనా కంటే మెరుగ్గా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రస్తుతం దేశ ఆర్థిక వృద్ధిరేటు 7 శాతంగా ఉందని వెల్లడించారు. భవిష్యత్తులో పెట్టుబడులకు భారత్ సరైన గమ్యస్థానంగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. డిజిటల్ నైపుణ్యాలు దేశ ఆర్థిక ప్రగతిలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దిల్లీలో మంగళవారం జరిగిన బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో పాల్గొన్న ఆయన, దేశ ఆర్థిక వృద్ధి, సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడుల అవకాశాలు, ప్రజల సాధికారతపై మాట్లాడారు. అధికారం ఎవరి చేతిలో ఉందన్నది కాకుండా, ప్రజల ప్రయోజనాల కోసం దాన్ని ఎలా వినియోగిస్తున్నామన్నదే ముఖ్యమని మోదీ పేర్కొన్నారు. సాంకేతికత, డేటా, జ్ఞానం, ఆవిష్కరణలు నేటి ప్రపంచంలో కీలకమైన శక్తి వనరులుగా మారాయని చెప్పారు. వీటి ద్వారా లక్షలాది మందికి కొత్త అవకాశాలు కల్పించాలని సూచించారు. సాంకేతిక పురోగతి ప్రయోజనాలు కొద్దిమందికే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఆకాంక్షించారు. నియంత్రణ కంటే సాధికారతకు, పోటీ కంటే సహకారానికి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రధాని అన్నారు. వ్యక్తిగత విజయంతో పాటు ఇతరులు అభివృద్ధి సాధించేందుకు తోడ్పడే దృక్పథం అవసరమని పేర్కొన్నారు. జ్ఞానం, సంపద, అధికారాన్ని ఉన్నత లక్ష్యాల సాధనకు వినియోగించాలనే భావన భారతీయ సంప్రదాయంలో భాగమని వివరించారు. అధికారం విలువ దాని వినియోగంలోనే ఉంటుందని తెలిపారు. బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌ను తొలిసారిగా భారత్‌లో నిర్వహించడాన్ని మోదీ స్వాగతించారు. ఆర్థిక వ్యవస్థ, ఇంధనం వంటి అంశాలపై చర్చించే ఈ వేదికకు భారత్‌ను ఎంపిక చేయడం సరైన నిర్ణయమని అన్నారు. మైఖేల్ బ్లూమ్‌బర్గ్ సరైన సమయంలో సరైన ప్రదేశాన్ని ఎంచుకున్నారని వ్యాఖ్యానించారు.

ప్రపంచంతో కలిసి ఎదుగుతాం

భారత్ అభివృద్ధి ప్రపంచానికి నష్టం కలిగించే విధంగా కాకుండా, ఇతర దేశాలతో కలిసి సాగుతుందని ప్రధాని మోదీ అన్నారు. భారత్ ప్రజాస్వామ్యానికి తల్లి అని అభివర్ణించారు. దేశంలోని భాషా వైవిధ్యం, విభిన్న మీడియా వేదికలు, సామాజిక మాధ్యమాల వినియోగం ప్రజలకు భిన్నాభి ప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉందనడానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత్ డిజిటల్ వ్యవస్థ వివిధ రంగాల వ్యాపారాలకు ప్రయోజనం కలిగిస్తోందని మోదీ వివరించారు. దేశ ఆర్థిక వృద్ధిలో డిజిటల్ సాంకేతికత కీలక పాత్ర పోషిస్తోందన్నారు. భారత్‌ను సందర్శించే విదేశీ అతిథులు దేశ డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను వినియోగించి చూడాలని సూచించినట్లు తెలిపారు. వీధి వ్యాపారి నుంచి కార్ల షోరూమ్ నిర్వాహకుడి వరకు భిన్న స్థాయుల్లో వ్యాపారాలు నిర్వహించే వారంతా ఒకే డిజిటల్ చెల్లింపుల వేదికను ఉపయోగించగలగడం సమ్మిళిత సాంకేతికతకు ఉదాహరణ అని ప్రధాని పేర్కొన్నారు. డిజిటల్ నైపుణ్యాలను మరింత విస్తరించడం ద్వారా ప్రజలకు అవకాశాలు పెరుగుతాయని, భవిష్యత్తులో భారత్ పెట్టుబడులకు ఆకర్షణీయమైన కేంద్రంగా ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రెండు ఎమ్మెల్సీ స్థానాలు గెలవాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పేర్కొన్నారు.నల్గొండ – ఖమ్మం – వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి, హైదరాబాద్ – రంగారెడ్డి – మహబూబ్‌నగర్ స్థానానికి సామా రామ్మోహన్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించిన అభ్యర్థులు, పార్టీ నేతలను కలిసి తమ గెలుపునకు సహకరించాలని కోరుతున్నారు.

కరవు, విద్యుత్ కొరతపైనా చర్చ

మంత్రులు, ఎమ్మెల్యేలతో జరిగిన సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న కరవు పరిస్థితులు, విద్యుత్ కొరత అంశాలూ చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను వాస్తవాలతో తిప్పికొట్టాలని సీఎం సూచించినట్లు తెలిసింది. ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జ్ మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రెండు స్థానాల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించేలా క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమాయత్తం చేయాలని రేవంత్‌రెడ్డి, మహేశ్‌కుమార్ గౌడ్ నేతలకు దిశానిర్దేశం చేశారు.

ముగిసిన టీకాంగ్రెస్ ఢిల్లీ పర్యటన

ఢిల్లీ పర్యటన ముగించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌కు చేరుకున్నారు. రాత్రి 8 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి, రోహిన్ రెడ్డిలు ఢిల్లీ నుంచి బయలుదేరారు. ఏఐసీసీ పిలుపు మేరకు ఆదివారం దిల్లీ వెళ్లిన పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డీసీసీ అధ్యక్షులు, మహిళా కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, యువజన కాంగ్రెస్ నాయకులు తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను, రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు కలిశారు.



రహదారి ప్రాజెక్టులకు కేంద్రం ఆమోదం

న్యూఢిల్లీ: తెలంగాణలో చేపట్టనున్న పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెల్లడించారు. దిల్లీలో గడ్కరీతో భేటీ అయిన ఆయన రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి, వంతెనల నిర్మాణం, రవాణా సౌకర్యాల విస్తరణకు సంబంధించిన పలు ప్రతిపాదనలను వివరించారు. ఎల్బీనగర్ – హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌తో పాటు కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణ ప్రతిపాదనకు కూడా ఆమోదం లభించినట్లు తెలిపారు. కృష్ణా నదిపై ఐకానిక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం సానుకూలంగా స్పందించిందని కోమటిరెడ్డి పేర్కొన్నారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే జాతీయ రహదారి – 167 ద్వారా తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రవాణా అనుసంధానం మరింత మెరుగుపడుతుందని తెలిపారు. ప్రయాణ సమయం తగ్గడంతో పాటు పర్యాటక రంగానికి కూడా ఊతం లభిస్తుందని వివరించారు. హైదరాబాద్ – శ్రీశైలం జాతీయ రహదారి – 765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి కొత్త సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయాలని గడ్కరీ అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. హైదరాబాద్ – అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ ప్రతిపాదనపైనా కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. పర్వతమాల పథకం కింద తెలంగాణలో ఐదు రోప్‌వేల నిర్మాణానికి ఆమోదం లభించిందని కోమటిరెడ్డి చెప్పారు. సేతు బంధన్ పథకం కింద మూడు రైల్వే ఓవర్ బ్రిడ్జిల (ఆర్‌వోబీలు) నిర్మాణానికి కూడా అనుమతులు వచ్చినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో 34 రహదారి పనులకు కేంద్ర రహదారి మౌలిక వసతుల నిధి (సీఆర్ఐఎఫ్) నుంచి నిధులు మంజూరు చేయాలని కోరగా, సంబంధిత అధికారులకు గడ్కరీ ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. పలు రహదారులను జాతీయ రహదారులుగా మార్చాలని కూడా కేంద్ర మంత్రిని కోరినట్లు వివరించారు. పుల్లూరు – అల్లంపూర్ – జట్రపోలు – పెంట్లవెల్లి – కొల్లాపూర్ – లింగాల – అచ్చంపేట – డిండి – దేవరకొండ – మల్లేపల్లి – నల్గొండ మార్గాలను జాతీయ రహదారులుగా అభివృద్ధి చేసే ప్రతిపాదనపై సానుకూల స్పందన వచ్చినట్లు చెప్పారు. హైదరాబాద్ – విజయవాడ – మచిలీపట్నం మార్గంలో జాతీయ రహదారి – 65 విస్తరణ పనులను వేగవంతం చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చినట్లు కోమటిరెడ్డి తెలిపారు. ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు 7.1 కిలోమీటర్ల మెట్రో రైలు మార్గం, అదే మార్గంలో జాతీయ రహదారి విస్తరణలో భాగంగా 5.5 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ కారిడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం గతంలో కేంద్రాన్ని కోరిందని గుర్తుచేశారు. తాజాగా డబుల్ డెక్కర్ కారిడార్‌కు ఆమోదం లభించిందని వెల్లడించారు.

ఇండియన్ రోడ్ కాంగ్రెస్‌కు ఆహ్వానం

హైదరాబాద్‌లో నవంబర్ 19 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఇండియన్ రోడ్ కాంగ్రెస్ సమావేశాలకు హాజరు కావాలని నితిన్ గడ్కరీని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆహ్వానించారు. రాష్ట్రంలో రహదారుల అభివృద్ధికి కేంద్రం సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు.

లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమే



న్యూఢిల్లీ: లద్దాఖ్ విషయంలో చైనా చేస్తున్న వాదనలను భారత్ తోసిపుచ్చింది. లద్దాఖ్ భారత్‌లో అంతర్భాగమని మరోసారి స్పష్టం చేసింది. చైనా ఎన్ని అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఈ వాస్తవం మారదని తేల్చిచెప్పింది. లద్దాఖ్‌లోని 28 వ్యూహాత్మక ప్రాంతాలకు అధికారిక పేర్లను ఖరారు చేసి, భారత మ్యాప్‌లలో చేర్చడంపై చైనా అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన వివాదం తెరపైకి వచ్చింది.కేంద్రపాలిత ప్రాంతమైన లద్దాఖ్‌లోని భౌగోళిక ప్రాంతాలకు పేర్లను ఖరారు చేసే ముందు అక్కడి పరిపాలనా విభాగాలు, స్థానిక ప్రజలు, ఇతర భాగస్వాములతో విస్తృతంగా సంప్రదింపులు జరిపినట్లు భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు. సర్వే ఆఫ్ ఇండియా అధికారిక మ్యాప్‌లలో ఈ పేర్లను చేర్చినట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాలను మ్యాప్‌లలో స్పష్టంగా గుర్తించడం వల్ల ప్రజల్లో అవగాహన పెరగడంతో పాటు వాటిని కచ్చితంగా గుర్తించేందుకు వీలవుతుందని వివరించారు.

చైనా తీవ్ర అభ్యంతరం

లద్దాఖ్‌లోని ప్రాంతాలకు ప్రామాణిక పేర్లను కేటాయించాలన్న భారత్ నిర్ణయాన్ని చైనా తీవ్రంగా వ్యతిరేకించింది. భారత్ ఏకపక్షంగా ఏర్పాటు చేసిన లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాన్ని తాము గుర్తించడం లేదని పేర్కొంది. భారత ప్రభుత్వం ప్రకటించిన పేర్లను కూడా అంగీకరించబోమని స్పష్టం చేసింది. చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావో నింగ్ మంగళవారం బీజింగ్‌లో మీడియాతో మాట్లాడుతూ, భారత్ తీసుకున్న చర్య చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించారు. చైనా – భారత్ సరిహద్దులోని పశ్చిమ ప్రాంతం చైనాకు చెందిందన్న తమ వైఖరిలో ఎలాంటి మార్పు ఉండదని, భారత నిర్ణయం వల్ల సరిహద్దులపై తమ అభిప్రాయం మారదని పేర్కొన్నారు. లద్దాఖ్‌లో

సింగరేణి కార్మికులకు లాభాల్లో 34 శాతం వాటా!

- కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- 15 రోజుల్లో పెండింగ్ వారసత్వ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు
- కార్మికుల సొంతింటి కల సాకారానికి ప్రభుత్వ భరోసా



ప్రజానావ, హైదరాబాద్ : సింగరేణి కార్మికుల సంక్షేమానికి తమ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. కార్మికుల శ్రమకు తగిన గుర్తింపునివ్వడంతో పాటు వారి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడం, పెండింగ్‌లో ఉన్న వారసత్వ ఉద్యోగాల సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా

సింగరేణి సంస్థ సాధించిన రూ.1,754 కోట్ల లాభాల్లో కార్మికులకు 34 శాతం వాటా ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికులకు లాభాల్లో వాటా కల్పించడం ద్వారా వారి శ్రమకు తగిన గుర్తింపు లభించనుంది. ఈ వాటా కింద ఒక్కో ఉద్యోగికి సగటున రూ.1,53,912 అందనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే దసరా బోనస్‌గా ఒక్కొక్కరికి రూ.1,10,250 ప్రకటించిన నేపథ్యంలో కార్మిక కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్

సింగరేణి సంస్థలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సైతం ప్రభుత్వం రూ.5,500 బోనస్ ప్రకటించింది. రెగ్యులర్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సేవలను గుర్తిస్తూ తీసుకున్న ఈ నిర్ణయం వారికి ఆర్థికంగా కొంత ఊరటనివ్వనుంది.

15 రోజుల్లో వారసత్వ ఉద్యోగాల సమస్యపై చర్యలు

వారసత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న సింగరేణి కార్మికుల పిల్లలకు న్యాయం చేసే దిశగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కీలక ప్రకటన చేశారు. విజిలెన్స్ విచారణలు, పెండింగ్ కేసుల కారణంగా నిలిచిపోయిన ఉద్యోగాల అంశాలను పరిశీలించి, 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని వెల్లడించారు. దీంతో ఏళ్లుగా ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న కుటుంబాల్లో ఆశలు చిగురించాయి.

కార్మికుల సొంతింటి కల సాకారం

సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని సమావేశంలో వెల్లడించారు. కార్మికులు, వారి కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించడం, ఆర్థిక భద్రతను బలోపేతం చేయడం ప్రభుత్వ సంక్షేమ లక్ష్యాల్లో భాగమని పేర్కొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం

తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో సింగరేణి సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. వేలాది కుటుంబాలకు జీవనాధారంగా ఉన్న ఈ సంస్థలో బొగ్గు ఉత్పత్తి నుంచి విద్యుత్ రంగానికి అవసరమైన వనరుల సమకూర్పు వరకు కార్మికుల కృషి కీలకంగా ఉంది. వారి సంక్షేమం, పిల్లలకు ఉద్యోగ అవకాశాలు, కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పించే దిశగా ప్రభుత్వం ప్రకటించిన నిర్ణయాలు సింగరేణి ప్రాంతంలో చర్చనీయాంశంగా మారాయి. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్‌రావు, గంద్ర సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు. ప్రకటించిన ప్రయోజనాలు కార్మికులకు అందడంతో పాటు పెండింగ్ వారసత్వ ఉద్యోగాల సమస్య పరిష్కారానికి చర్యలు త్వరగా అమలులోకి రావాలని కార్మిక కుటుంబాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

కుభీర్‌లో పత్తి కొనుగోళ్లు ప్రారంభం

- క్వింటాల్‌కు రూ.9,100 ధర చెల్లింపు
- ప్రత్యేక పూజలు.. రైతులకు శాలువాలతో సత్కారం
- మిల్లు నిర్వాహకుల ఆధ్వర్యంలో అన్నదానం



ప్రజానావ, కుభీర్ : నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలోని నాగేష్ పత్తి మిల్లులో పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మిల్లులో ప్రత్యేక పూజలు నిర్వహించి కొనుగోళ్లను లాంఛనంగా ప్రారంభించారు. తొలుత పత్తిని తీసుకువచ్చిన వాహనాలతో పాటు తూకం వేసే యంత్రాలకు పూజలు చేశారు. ఈ పత్తి కొనుగోళ్ల సీజన్ రైతులు, వ్యాపారులకు లాభదాయకంగా సాగాలని ఆకాంక్షించారు. పత్తి విక్రయించేందుకు మిల్లుకు వచ్చిన పలువురు రైతులను వ్యాపారులు శాలువాలతో సత్కరించారు. కొనుగోలు చేసిన పత్తికి క్వింటాల్‌కు రూ.9,100 చొప్పున ధర చెల్లించినట్లు మిల్లు యజమానులు వెల్లడించారు. పత్తి నాణ్యత, తేమ శాతం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చూడాలని ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు సూచించారు. అనంతరం మిల్లు నిర్వాహకులు రెడ్డిశెట్టి సంతోష్, ఆనంద్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గోనే కళ్యాణ్, సర్పంచ్ కందూరి సాయినాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి, పీఏసీఎస్ సీఈవో ఎగ్గం క్రాంతికుమార్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు తోకల మారుతి, రైతులు, వ్యాపారులు పాల్గొన్నారు.

కన్న కూతుళ్లపై తండ్రి లైంగిక దాడి

నిందితుడి అరెస్ట్

ప్రజానావ, ముంబై: మహారాష్ట్రలోని లాతూర్ జిల్లా అహ్మద్‌పూర్‌లో దారుణ ఘటన వెలుగుచూసింది. నాలుగున్నర, మూడేళ్ల వయసున్న తన ఇద్దరు చిన్న కుమార్తెలపై తండ్రి లైంగిక దాడికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. అక్టోబర్ 7న తెల్లవారుజామున బాలికల ఏడుపు విని నిద్రలేచిన తల్లి ఈ ఘటనను గుర్తించింది. విషయం బయటపెడితే భార్యాపిల్లలను చంపేస్తానని నిందితుడు బెదిరించినట్లు సమాచారం. బాధితుల తల్లికి బాలల సంరక్షణ అధికారులు కౌన్సిలింగ్ ఇచ్చి, బాలికలకు వైద్య చికిత్స అందించారు. అనంతరం తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టంతో పాటు సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు.

ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ ద్వంద్వ వైఖరి

- ఢిల్లీలో నిరసన యాత్రలో కర్ణాటక సీఎం శివకుమార్
- బెంగళూరులో ఆందోళనకారుల అరెస్టులు

న్యూఢిల్లీ : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో ఇండియా కూటమి నిర్వహించిన నిరసన యాత్రలో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పాల్గొన్నారు. మరోవైపు, ఇదే అంశంపై బెంగళూరులో నిరసన తెలిపిన సుమారు 100 మందిని కర్ణాటక పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ వైఖరిపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలి

ఫిలింనగర్ డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ప్రజానావ, హైదరాబాద్ : ఖైరతాబాద్ నియోజకవర్గంలోని ఫిలింనగర్ డివిజన్ బీజేపీ కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షుడు ముద్దంగుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 15న సాయంత్రం 5 గంటలకు సాగర్ సొసైటీ గ్రౌండ్స్‌లో ఖైరతాబాద్ నియోజకవర్గ బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బతుకమ్మ వేడుకలను విజయవంతం చేయాలని చింతల రామచంద్రారెడ్డి కోరారు. ఫిలింనగర్ డివిజన్‌లోని మహిళలు, ఆడపడుచులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఘనంగా నిర్వహించేలా డివిజన్ కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై ప్రత్యేక దృష్టి సారించాలని, నో మ్యాపింగ్, లాజికల్ డిస్క్రిపెన్సీస్, కొత్త ఓటర్ల నమోదు వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని నాయకులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను కూడా ప్రాధాన్యంగా తీసుకోవాలని కోరారు. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికలు, ఖైరతాబాద్ ఉపఎన్నికల్లో పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని చింతల రామచంద్రారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో హైదరాబాద్ సెంట్రల్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటస్వామి, జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు వల్లపు శంకర్, సీనియర్ నాయకుడు గందె అరుణ్‌కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల గణేష్ యాదవ్, ఖైరతాబాద్ అసెంబ్లీ బీజేవైఎం కన్వీనర్ దండగుల శేఖర్, ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడు బోయ రామాంజనేయులు, కిసాన్ మోర్చా మీడియా సెల్ కో–కన్వీనర్ పుట్ల శశిశేఖర్, ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు ప్రభాకర్ పాల్గొన్నారు. ఫిలింనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శులు దొంగరి రాజకళ, గుంటి ఆనంద్ సాగర్, ఉపాధ్యక్షులు హనుమంతు ముదిరాజ్, వలిశెట్టి రాంబాబు, తాళ్ల తిరుపతి యాదవ్, ఓర్సు రమేష్, కార్యదర్శులు బొట్టు కళ్యాణి, జరిపెట్టి సైదులు, కె. శ్రీకాంత్, ఎస్. శ్రీకాంత్, శ్రీకాంత్‌తో పాటు డివిజన్ సీనియర్ నాయకులు మల్లికార్జున్ గౌడ్, సంపంగి రామకృష్ణ, మహిళా మోర్చా అధ్యక్షురాలు జి. రమ్య, కిసాన్ మోర్చా అధ్యక్షుడు కె. పురుషోత్తం, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు వరికుప్పల కృష్ణ, యువ మోర్చా అధ్యక్షుడు మంజుల నరసింహ, యువ మోర్చా ప్రధాన కార్యదర్శి హరీష్ ముదిరాజ్, డివిజన్ కార్యవర్గ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సింగరేణి కార్మిక గర్జనను విజయవంతం చేయాలి

- 14న గోదావరిఖనిలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభ
- కేటీఆర్ ఆధ్వర్యంలో సభ.. కార్మికులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలి
- తాండూర్‌లో సన్నాహక సమావేశంలో మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపు

ప్రజానావ, తాండూర్ : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం ఈ నెల 14న గోదావరిఖనిలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'సింగరేణి కార్మిక గర్జన' భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా తాండూర్‌లో మంగళవారం నిర్వహించిన సభ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని, సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సభకు ముఖ్య అతిథిగా హాజరవుతారని తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు వారి హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ సభకు తాండూర్ మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుబ్బ దత్తుమూర్తి, మాజీ ఎంపీపీ పూసాల ప్రణయ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ మంగపతి సురేష్‌బాబు, సీనియర్ నాయకులు మహోర్కర్ దత్తాత్రేయ రావు, బోనగిరి చంద్రశేఖర్, మాసాడి శ్రీరాములు, ఎలుక రామచందర్, గట్టు సంతోష్‌కుమార్, మొగిలి శంకర్, గడ్డం మణికుమార్, కిష్టఫర్, దుర్గం శ్రీనివాస్, బోడ సతీష్, జాడి పోషం, గొమాస తిరుపతి, చింటూ, బాబుఖాన్, ప్రదీప్‌రావు, ఉప్పుట్ల సంతోష్, ఇక్బాల్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, టీబీజీకేఎస్ నాయకులు హాజరయ్యారు.







ఏజెన్సీ కానిస్టేబుల్ పోస్టుల్లో 75 శాతం ఎస్టీ రిజర్వేషన్లు అమలు చేయాలి

- తాజా నోటిఫికేషన్‌లో రిజర్వేషన్లను విస్మరించారు
- 400 మంది గిరిజన యువతకు అన్యాయం జరిగే ప్రమాదం
- నోటిఫికేషన్‌లో మార్పులు చేయకుంటే ప్రభుత్వంపై పోరాటం తప్పదు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కవిత

ప్రజానావ, హైదరాబాద్ : ఏజెన్సీ ప్రాంతాల్లో కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీలో ఎస్టీలకు కల్పించాల్సిన 75 శాతం రిజర్వేషన్లను తప్పనిసరిగా అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తాజాగా విడుదల చేసిన కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ప్రాంతాల గిరిజన రిజర్వేషన్లను విస్మరించారని ఆరోపించారు. దీనివల్ల సుమారు 400 మంది ఎస్టీ యువత ఉద్యోగావకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఈ అంశంపై మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించిన ఆమె.. తక్షణమే నోటిఫికేషన్‌లో మార్పులు చేసి 75 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1988లో జారీ చేసిన జీవో 109తో పాటు, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లో కానిస్టేబుల్ పోస్టులకు ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉంటుందని కవిత గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2015, 2018, 2022 సంవత్సరాల్లో విడుదలైన కానిస్టేబుల్ నియామక నోటిఫికేషన్లలో ఈ రిజర్వేషన్లను అమలు చేశారని తెలిపారు. అయితే తాజా నోటిఫికేషన్‌లో వాటిని విస్మరించడం గిరిజన యువతకు అన్యాయం చేయడమేనని విమర్శించారు. ఈ నిర్ణయం కారణంగా ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నాగర్‌కర్నూల్, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన ఆదివాసీ, గిరిజన యువత తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని కవిత పేర్కొన్నారు. అర్హులైన నిరుద్యోగులు దాదాపు 400 మంది కానిస్టేబుల్ ఉద్యోగాలను కోల్పోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. గత నియామకాల్లో అమలు చేసిన రిజర్వేషన్లను తాజా నోటిఫికేషన్‌లో తొలగించడం గిరిజనుల హక్కులకు విఘాతం కలిగిస్తుందని అన్నారు. హోంమంత్రి బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి ఈ అంశంపై తక్షణమే స్పందించాలని కవిత కోరారు. ఏజెన్సీ ప్రాంత గిరిజన యువతకు న్యాయం జరిగేలా నియామక నోటిఫికేషన్‌లో అవసరమైన మార్పులు చేయాలని డిమాండ్ చేశారు. కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు దక్కాల్సిన 75 శాతం రిజర్వేషన్లను పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయకపోతే గిరిజన యువతతో కలిసి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో కుమారుడిని కోల్పోయిన కుటుంబానికి కవిత పరామర్శ

ఈసీఐఎల్ పరిధిలోని నాగారంలో తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సీనియర్ నాయకుడు పబ్బోజు విజేందర్ కుటుంబాన్ని పరామర్శించారు. విజేందర్ కుమారుడు మురళీ కార్తీక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో నాగారంలోని వారి నివాసానికి వెళ్లిన కవిత.. విజేందర్‌తో పాటు కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుమారుడిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇంటి నంబర్ల జారీలో అక్రమాలంటూ నిరసన

పంచాయతీ కార్యదర్శిని నిర్బంధించి కార్యాలయానికి తాళం

ప్రజానావ, పోతంగల్ : నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగర్గ గ్రామపంచాయతీ కార్యదర్శి వ్యవహారశైలిపై సర్పంచ్, పాలకవర్గ సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకుండా ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు జారీ చేస్తున్నారని, ఇందుకోసం డబ్బులు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారాన్ని నిరసిస్తూ మంగళవారం కార్యదర్శిని నిర్బంధించి, గ్రామపంచాయతీ కార్యాలయానికి తాళం వేసి ఆందోళనకు దిగారు. సంబంధిత కార్యదర్శికి సోమవారం బదిలీ అయినట్లు తెలిసిందని సర్పంచ్, పాలకవర్గ సభ్యులు పేర్కొన్నారు. అయినప్పటికీ మంగళవారం ఉదయం కార్యాలయానికి వచ్చి, తమకు సమాచారం ఇవ్వకుండా మరికొందరికి ఇంటి నంబర్ల కోసం రసీదులు జారీ చేశారని ఆరోపించారు. బదిలీ అయిన వ్యక్తి ఏ హోదాలో రసీదులు జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. గ్రామంలో ఇంటి నంబర్ల కేటాయింపు విషయంలో ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యదర్శి వ్యవహార శైలిపై గతంలో పలుమార్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు తీసుకోలేదని సర్పంచ్, పాలకవర్గ సభ్యులు ఆరోపించారు. గ్రామపంచాయతీ వ్యవహారాల్లో పారదర్శకత పాటించాలని, ఖాళీ స్థలాలకు ఇంటి నంబర్లు జారీ చేసిన అంశంపై సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు గ్రామానికి వచ్చి వివరణ ఇచ్చే వరకు కార్యాలయానికి వేసిన తాళం తీయబోమని స్పష్టం చేస్తూ అక్కడే బైఠాయించారు. ఈ ఆరోపణలపై అధికారుల స్పందన తెలియాల్సి ఉంది.





అమర వీరుల త్యాగం వెలకట్టలేనిది

- వారి కుటుంబాల సంక్షేమం మనందరి బాధ్యత
- అమర వీరుల కుటుంబాల సన్మాన కార్యక్రమంలో గవర్నర్ శివప్రతాప్ శుక్లా

ప్రజానావ, హైదరాబాద్ : దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమర వీరుల త్యాగం వెలకట్టలేనిదని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. దేశం కోసం సర్వస్వం త్యాగం చేసిన సైనికుల కుటుంబాల గౌరవం, సంక్షేమం, వారి పిల్లల భవిష్యత్తుకు అండగా నిలవడం ప్రభుత్వం, సమాజం ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని డియోరియాలో నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో సమర్పణ సంస్థ నిర్వహించిన అమర వీరుల కుటుంబాల సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సరిహద్దుల్లో సైనికులు దేశాన్ని కాపాడుతుంటే, వారి వెనుక కుటుంబాలు ఎన్నో త్యాగాలు, కష్టాలను భరిస్తున్నాయని భావోద్వేగంగా పేర్కొన్నారు. అమర వీరుల కుటుంబాలను గౌరవించడం కేవలం కార్యక్రమాలకే పరిమితం కాకూడదని, వారి సుఖదుఃఖాల్లో భాగస్వాములై, అవసరమైనప్పుడు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశభక్తి నినాదాలకే పరిమితం కాకుండా విధుల పట్ల నిబద్ధత, సామాజిక సామరస్యం, ప్రజాసేవలోనూ ప్రతిబింబించాలని సూచించారు. అమర వీరుల కలల భారతాన్ని నిర్మించేందుకు యువత బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని, దేశ ఐక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా అమర వీరులకు ఘనంగా నివాళులర్పించి, వారి కుటుంబాలకు హృదయపూర్వక నమస్కారాలు తెలిపారు.



ఉత్తరప్రదేశ్‌లోని విష్ణుపూర్‌లో కృషక్ ఇంటర్మీడియట్ కళాశాల వ్యవస్థాపకుడు స్వర్గీయ పండిట్ కృష్ణదేవ్ త్రిపాఠి విగ్రహావిష్కరణ కార్యక్రమంలోనూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. విద్యా రంగానికి సేవలందించిన మహనీయుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

రుద్ర మహాయజ్ఞంలో పాల్గొన్న గవర్నర్

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ జిల్లా బర్హల్‌గంజ్ ముక్తిపథ్‌లో చిల్లూపర్ ఎమ్మెల్యే రాజేశ్ త్రిపాఠి నిర్వహించిన రుద్ర మహాయజ్ఞంలో గవర్నర్ పాల్గొన్నారు. యజ్ఞాలు త్యాగం, సేవ, సమర్పణ, లోకకల్యాణానికి ప్రతీకలని అన్నారు. ఆధ్యాత్మిక చైతన్యాన్ని మానవసేవ, సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణతో అనుసంధానించాలని పిలుపునిచ్చా రు. భగవాన్ రుద్రుడి ఆశీస్సులతో ప్రజలందరికీ సుఖశాంతు లు, ఆరోగ్యం, సమృద్ధి కలగాలని ఆకాంక్షించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో భాగంగా మూడు కార్యక్రమాల్లో పాల్గొన్న గవర్నర్ శివప్రతాప్ శుక్లా.. దేశభక్తి, విద్యాభివృద్ధి, ఆధ్యాత్మికత, సామాజిక సేవల ప్రాధాన్యాన్ని వివరించారు.

ప్లేటులో విషం.. పర్యవేక్షణలో మౌనం!

- కార్బైడ్ పండ్లు.. విషరంగు మిఠాయిలు.. మళ్లీ వాడిన నూనె
- హోటళ్లలో నిబంధనలకు తూట్లు
- తనిఖీలు ఉన్నా కొరవడుతున్న పర్యవేక్షణ



ప్రజానావ, వరంగల్: హోటళ్ల నిర్వాహకులు ఆహార భద్రతా ప్రమాణాలను గాలికొదిలేస్తుండటంతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు పొంచి ఉంది. మాంసం, కూరగాయలను ఒకే ఫ్రిజ్‌లో నిల్వ చేయడం, పండ్లను విషపూరిత కార్బైడ్‌తో పక్వానికి తీసుకురావడం, బేకరీలు, మిఠాయి దుకాణాల్లో హానికర రంగులను మోతాదుకు మించి వినియోగించడం, ఒకసారి వాడిన వంట నూనెను మళ్లీ మళ్లీ వినియోగించడం వంటి నిబంధనల ఉల్లంఘనలు ఆందోళన కలిగిస్తున్నాయి. వ్యాపారులు నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, సంబంధిత అధికారులు పూర్తి స్థాయిలో పర్యవేక్షించకపోవడం కలిసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆహార భద్రతా విభాగం అధికారులు ప్రతి నెలా నిఘా చర్యల్లో భాగంగా ఆహార పదార్థాల నమూనాలను సేకరించి ప్రయోగశాలలకు పంపించాల్సి ఉంటుంది. లైసెన్స్ ఉన్న వ్యాపార సంస్థల నుంచి పది, లైసెన్స్ లేని సంస్థలు, ప్రభుత్వ హాస్టళ్ల నుంచి పది, పెద్ద హోటళ్లు, రెస్టారెంట్ల నుంచి మరో పది నమూనాలు సేకరించాల్సి ఉంటుంది. ఈ మేరకు నిర్దేశించిన విధులను అన్ని జిల్లాల అధికారులు చిత్తశుద్ధితో నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆహార భద్రతా విభాగం అధికారులు నిర్వహించిన తనిఖీల్లో పలు హోటళ్ల నిర్వాహకుల నిర్లక్ష్యం వెలుగుచూస్తోంది. వంటశాలల్లో అపరిశుభ్రత, మాంసాన్ని నిల్వ చేసే విషయంలో నిబంధనలు పాటించకపోవడం వంటి ఉల్లంఘనలను అధికారులు గుర్తించారు. హనుమకొండ జిల్లాలో 36 కేసులు నమోదు కాగా వాటిలో 22 క్రిమినల్ కేసులు ఉన్నాయి. మరో 12 యాజమాన్యాలకు నోటీసులు జారీ చేసి రూ.1.83 లక్షల జరిమానా విధించారు. వరంగల్ జిల్లాలో 12 కేసులు నమోదు కాగా నాలుగు క్రిమినల్ కేసులు ఉన్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారుల పై రూ.2.15 లక్షల జరిమానా విధించడంతోపాటు మరో 14 హోటళ్లకు నోటీసులు జారీ చేశారు. మహబూబాబాద్ జిల్లాలో 16 కేసులు నమోదయ్యాయి. ఇదే అధికారి ములుగు జిల్లాకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ అక్కడ ఎనిమిది కేసులు నమోదు చేశారు. జనగామ జిల్లాలో 11 కేసులు నమోదు చేయడంతోపాటు రూ.2 లక్షల జరిమానా విధించారు. పలువురు వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. భూపాలపల్లి జిల్లాకు వరంగల్ జిల్లా అధికారే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తుండగా రెండు క్రిమినల్ కేసులు నమోదు చేసి, 12 మంది వ్యాపారులకు జరిమానాలు విధించారు. మరోవైపు ప్రజలు కూడా ఆహార పదార్థాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.



పేకాట స్థావరంపై దాడులు

ముగ్గురు అరెస్ట్.. రూ.17,300 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజానావ, మెదక్: జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిఘా ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కౌల్చారం మండలం పోతన్‌శెట్టిపల్లి గ్రామంలోని హనుమాన్ ఫంక్షన్ హాల్ వద్ద పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.17,300 నగదు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిని కౌల్చారం గ్రామానికి చెందిన సత్యనారాయణ, శేఖర్, నర్సింలుగా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లాలో పేకాట, జూదం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఇలాంటి కార్యకలాపాలపై నిరంతరం నిఘా కొనసాగిస్తామని, సమాచారం అందిన వెంటనే దాడులు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో పేకాట లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టవిరుద్ధ కార్యకలాపాల నియంత్రణకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు.

బతుకమ్మ ఖర్చులపై అనుమానాలు

- రూ.2.40 లక్షల నిధుల వినియోగంపై చర్చ
- రూ.వెయ్యి నుంచి రూ.3 వేల ఖర్చుకే పరిమితమై
- మిగతా మొత్తానికి బిల్లులా?
- 24 పాఠశాలల్లో సమగ్ర తనిఖీలు చేపడితేనే వెలుగులోకి అసలు వాస్తవాలు




ప్రజానావ, భద్రాద్రి కొత్తగూడెం : ప్రభుత్వ పాఠశాలల్లో పండగల నిర్వహణకు ప్రభుత్వం విడుదల చేసే నిధులను నిర్దేశించిన కార్యక్రమాలకే ఖర్చు చేయాలి. చేసిన వ్యయానికి సంబంధించి పూర్తి స్థాయి ఆధారాలతో కూడిన బిల్లులను సమర్పించాలి. అయితే జిల్లాలోని ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పాఠశాలల్లో బతుకమ్మ ఉత్సవా ల నిర్వహణ ఖర్చుల వ్యవహారం ప్రస్తుతం చర్చనీ యాంశంగా మారింది. జిల్లాలోని 24 పాఠశాలల్లో ఒక్కో పాఠశాలకు రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.40 లక్షల నిధులు విడుదలయ్యాయి. అయితే కొన్ని పాఠశాలల్లో బతుకమ్మ వేడుకల నిర్వహణకు రూ.వెయ్యి నుంచి రూ.3 వేల వరకు మాత్రమే ఖర్చు చేసి, మిగిలిన మొత్తానికి సరిపడా బిల్లులు సమర్పిం చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నిధుల వినియోగంపై అనుమానాలు వ్యక్తమవుతు న్నాయి. ప్రభుత్వం కేటాయించిన నిధులు పూర్తి స్థాయిలో ఖర్చయ్యాయా? బిల్లుల్లో చూపిన మేరకు వస్తువులు కొనుగోలు చేశారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. జిల్లాలోని మొత్తం 24 పీఎంశ్రీ పాఠశాలల్లో నిర్వహణ ఖర్చులపై సమగ్ర విచారణ చేపడితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

తనిఖీలతోనే వాస్తవాలు వెలుగులోకి..

ప్రభుత్వ పాఠశాలలకు వివిధ కార్యక్రమాలు, పథకాల అమలు కోసం నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో వాటి వినియోగంపై అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాల్సిన అవసరం ఉంది. బతుకమ్మ ఉత్సవాల ఖర్చులకే పరిమితం కాకుండా ఇతర పథకాల కింద విడుదలైన నిధులు, వస్తువుల కొనుగోళ్ల, చెల్లింపుల వివరాలనూ క్షుణ్ణంగా పరిశీలించాలి. సమర్పించిన బిల్లుల్లో పేర్కొన్న వస్తువులను నిజంగానే కొనుగోలు చేశారా? వాటి కోసం ఎవరికి చెల్లింపులు చేశారు? ఖర్చులకు సంబంధించిన రికార్డులు సక్రమంగా ఉన్నాయా? అనే అంశాలను తనిఖీల ద్వారా నిర్ధారించాలి. అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి, నిధుల వినియోగంలో ఏవైనా అవకతవకలు జరిగినట్లు తేలితే బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మెదక్‌లో చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం

- ఘటనపై రజక సంఘాల ఆగ్రహం
- బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్
- సీసీ కెమెరాల పనితీరుపై అసంతృప్తి.. పోలీసులకు ఫిర్యాదు



ప్రజానావ, మెదక్: మెదక్ పట్టణంలో తెల్లవారు జామున చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం కావడం కలకలం రేపింది. ఈ విషయం తెలుసుకున్న రజక సంఘం నాయకులు, వివిధ కుల సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో విగ్రహం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఘటన నేపథ్యంలో సీఐ మహేష్ ఆధ్వర్యంలో విగ్రహం వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. నిరసనకారులు సంయమనం పాటించాలని సీఐ సూచించారు. ఘటనపై దర్యాప్తును వేగవంతం చేసి బాధ్యులను గుర్తిస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసం ఘటనపై రజక సంఘం నాయకులు పోలీసుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. విగ్రహం వద్ద సరైన కోణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయకపోవడం, అందుబాటులో ఉన్న కెమెరాల్లోనూ ఘటనను స్పష్టంగా గుర్తించే పరిస్థితి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నప్పటికీ, ఆమె విగ్రహానికి తగిన భద్రత కల్పించకపోవడంపై పలువురు విమర్శలు గుప్పించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విగ్రహాలకు తగిన రక్షణ కల్పించాలని కోరారు. విగ్రహం ధ్వంసం విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు ఘటనాస్థలానికి చేరుకుని రజక సంఘం నాయకులకు మద్దతు తెలిపారు. ఈ ఘటనకు పాల్పడిన వారిని వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, రజక సంఘం ఆధ్వర్యంలో మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టాల్సి ఉంది. విగ్రహాన్ని ఎవరు, ఎందుకు ధ్వంసం చేశారనే విషయాలు తెలియాల్సి ఉంది. దర్యాప్తు పూర్తయితేనే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ప్రేమ వివాహం.. నెల రోజులకే విషాదాంతం!

ప్రజానావ, ఖమ్మం : ఎర్రుపాలెంలో విషాదం చోటుచేసుకుంది. ఐదేళ్లుగా ప్రేమించుకున్న మహేశ్, వెంకటరమణ నెల రోజుల క్రితమే వివాహం చేసుకున్నారు. అయితే దంపతుల మధ్య మనస్పర్థలు రావడంతో ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలంలోని అమ్మమ్మ ఇంటి వద్ద వెంకటరమణ ఆత్మహత్యకు పాల్పడింది. భార్య మరణాన్ని తట్టుకోలేక మహేశ్ ఎర్రుపాలెం రైల్వేగేట్ సమీపంలో రైలు కిందపడి మృతి చెందాడు. దీంతో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కొణిజర్ల మండలం చిన్నమునగాలకు చెందిన మోదుగు వెంకటేశ్వర్లు (53) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. ఆస్తమా మాత్రల కోసం ఆదివారం ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు వెతుకుతుండగా పెద మునగాల సమీపంలోని రహదారి పక్కన చెట్ల పొదల్లో ముఖంపై రక్తగాయాలతో మృతదేహంగా కనిపించాడు. ఈ ఘటనపై వెంకటేశ్వర్లు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదులో పలువురిపై అనుమానం వ్యక్తం చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జి.సూరజ్ తెలిపారు.

చెరుకు రైతుకు కష్టాలే

- టన్నుకు రూ.6 వేలు చెల్లించాలి
- వర్షాభావంతో సగానికి పడిపోయిన దిగుబడి
- పెరిగిన పెట్టుబడి ఖర్చులతో అప్పుల భారం
- ఫ్యాక్టరీ యాజమాన్యాలే కోత, రవాణా ఖర్చులు భరించాలని జహీరాబాద్ రైతుల డిమాండ్



ప్రజానావ, జహీరాబాద్: చెరుకు రైతులకు ఈ ఏడాది కష్టాలు తప్పడం లేదు. ఒకవైపు వర్షాభావ పరిస్థితులతో పంట దిగుబడి గణనీయంగా తగ్గిపోగా, మరోవైపు ఎరువులు, కూలీలు, రవాణా ఖర్చులు పెరిగి పెట్టుబడి భారం అధికమైంది. పంట సాగు కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. దిగుబడి తగ్గి, ఖర్చులు పెరిగిన నేపథ్యంలో తమకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని జహీరాబాద్ డివిజన్ పరిధిలోని చెరుకు రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ ఏడాది జూన్, జులై నెలల్లో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో చెరుకు పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడిందని రైతులు చెబుతున్నారు. గతంలో ఎకరాకు 45 టన్నుల వరకు దిగుబడి వచ్చేదని, ప్రస్తుతం 20 నుంచి 25 టన్నులకే పరిమితమవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడి సగానికి పడిపోవడంతో పెట్టిన పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. చెరుకు సాగుకు అవసరమైన ఎరువులు, దుక్కి దున్నడం, పంట కోత, రవాణా ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని పేర్కొంటున్నారు. కూలీలకు రోజుకు రూ.500 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోందని చెబుతున్నారు. పొలాల నుంచి చెరుకును ఫ్యాక్టరీలకు తరలించేందుకు అయ్యే రవాణా ఖర్చులనూ తామే భరించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట దిగుబడి తగ్గిన సమయంలో ఖర్చులు పెరగడంతో నష్టాలు మరింత ఎక్కువవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

టన్నుకు రూ.6 వేల ధర కల్పించాలి

చెరుకు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలతో సమావేశం ఏర్పాటు చేసి చెరుకు టన్నుకు రూ.5,500 ధర నిర్ణయించాలని కోరుతున్నారు. దీనికి అదనంగా ప్రభుత్వం రూ.500 సబ్సిడీ అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే పంట కోత, రవాణా ఖర్చులను ఫ్యాక్టరీ యాజమాన్యాలే భరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రతిపాదనల ప్రకారం టన్నుకు మొత్తం రూ.6 వేల మేర ఆదాయం లభిస్తేనే సాగు ఖర్చులు గిట్టుబాటవుతాయని చెబుతున్నారు. ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యాలు సంయుక్తంగా చర్యలు తీసుకుంటేనే తమకు కొంతమేర ఉపశమనం లభిస్తుందని ఆశిస్తున్నారు.

అప్పులు ఎలా తీర్చాలి?

న్యాల్కల్ మండలం మామిడిగి గ్రామానికి చెందిన రైతు రాజిరెడ్డి తన ఆవేదనను వ్యక్తం చేశారు. పంట సాగు కోసం ఎరువులు కొనుగోలు చేసేందుకు అప్పులు చేయాల్సి వస్తోందని, దిగుబడి తగ్గి సరైన ధర లభించకపోతే ఆ అప్పులను ఎలా తీర్చాలో అర్థం కావడం లేదని వాపోయారు. ప్రభుత్వం, ఫ్యాక్టరీ యాజమాన్యాలు స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఇదే పరిస్థితి కొనసాగితే వచ్చే ఏడాది చెరుకు సాగు చేయడం కూడా కష్టంగా మారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు సాగు ఖర్చుల భారాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ టైరు కిందపడి రైతు దుర్మరణం

ఇద్దరు కుమారులతో అనాథగా మారిన కుటుంబం

ప్రజానావ, మెదక్: ట్రాక్టర్‌పై నుంచి ప్రమాదవశాత్తు కిందపడి, అదే ట్రాక్టర్ టైరు కింద నలిగి ఓ రైతు మృతి చెందిన విషాద ఘటన మెదక్ జిల్లా పాపన్నపేట మండలం గాజులగూడెం శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గాజులగూడెం గ్రామానికి చెందిన పుట్టల సాయిలు (44) ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబానికి అండగా ఉన్న వ్యక్తి మృతితో భార్య, ఇద్దరు కుమారులు కన్నీరుమున్నీరవుతున్నారు. స్థానికుల వివరాల ప్రకారం.. గాజులగూడెం గ్రామానికి చెందిన సాయిలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం తన స్నేహితుడైన ట్రాక్టర్ డ్రైవర్ ఇస్మాయిల్‌తో కలిసి ఎంకేపల్లి గ్రామంలో నూతన ఇంటి నిర్మాణం కోసం పాత ఇంటి మట్టిని తరలించే పనికి వెళ్లాడు. ఈ క్రమంలో మట్టి తరలిస్తుండగా సాయిలు ప్రమాదవశాత్తు ట్రాక్టర్‌పై నుంచి కిందపడ్డాడు. అదే సమయంలో ట్రాక్టర్ టైరు అతనిపై నుంచి వెళ్లడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. అనంతరం పాపన్నపేట పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు సాయిలుకు భార్య పోచమ్మతో పాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబ పెద్దను కోల్పోవడంతో వారి కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎండిన బోర్లు.. ఎండుతున్న పంట

- రూ.4.40 లక్షల అప్పుతో సాగు..
- చివరకు పశువులకు వదిలిన రైతు



ప్రజానావ, నారాయణపేట : ఎల్‌నినో ప్రభావంతో వర్షాకాలంలో సరైన వర్షాలు కురవక, భూగర్భ జలాలు అడుగంటడంతో చేతికొచ్చిన పంట చేజారిపోయే పరిస్థితి ఏర్పడిందని మరికల్ మండలం బుద్దగాని తండాకు చెందిన రైతు పాండు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న ఎనిమిది ఎకరాల్లో వరి సాగు చేయగా, బోర్లు ఎండిపోవడంతో పంటకు నీరందక తీవ్ర నష్టం వాటిల్లిందని కన్నీటిపర్యంతమయ్యారు. ఇప్పటికే ఉన్న బోర్లు ఎండిపోవడంతో కొత్తగా ఎనిమిది బోర్లు వేయించినా చుక్క నీరు పడలేదని వాపోయారు. చేసేదేమీ లేక మంగళవారం తన వరి పొలంలో పశువులను వదిలి పంటను వదులుకోవాల్సి వచ్చిందని ఆవేదన చెందారు. ఎనిమిది ఎకరాల్లో వరి సాగు కోసం రూ.2.40 లక్షలు పెట్టుబడి పెట్టానని, బోర్లు వేయించేందుకు మరో రూ.2 లక్షలు అప్పు చేశానని తెలిపారు. మొత్తం రూ.4.40 లక్షలు ఖర్చు చేసినా పంట చేతికందకపోవడంతో అప్పుల భారం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని పాండు నాయక్ కోరారు.

ఆన్‌లైన్ ట్రక్‌షీట్‌తోనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

- మిల్లర్ల కోతలకు అడ్డుకట్ట వేయాలని రైతుల డిమాండ్
- గత అనుభవాలతో ఆందోళన
- కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆన్‌లైన్ ట్రక్‌షీట్ విధానాన్ని తప్పనిసరి



ప్రజానావ, నల్లగొండ: ప్రతి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యానికి మిల్లర్లు కొర్రీలు పెట్టి కోతలు విధించడం పరిపాటిగా మారిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద నిర్వాహకులు మాన్యువల్‌గా ట్రక్‌షీట్‌లలో వివరాలు నమోదు చేయడం, అనంతరం మిల్లులకు ధాన్యం చేరిన తర్వాత తాలు, తేమ పేరుతో కోతలు విధించడం, చివరకు మిల్లర్లు చెప్పిన ధాన్యం బస్తాల వివరాలనే నమోదు చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొంటున్నారు. ఈసారి ఎల్‌నినో ప్రభావంతో ధాన్యం దిగుబడి తగ్గడంతో పాటు పెట్టుబడి వ్యయం, కోతల ఖర్చులు పెరగడం రైతులను ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టిందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ కొనుగోలు ప్రక్రియ పూర్తయ్యే వరకు ఆన్‌లైన్ ట్రక్‌షీట్ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం గ్రేడ్–ఎ రకం ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధర ప్రకటించడంతో పాటు రైతులకు ప్రోత్సాహకంగా క్వింటా లుకు రూ.500 బోనస్ అందించనుంది. 17 శాతం తేమ ఉండేలా, తాలు, చెత్త, మట్టిపెళ్లలు లేకుండా కల్లాల్లో పూర్తిగా ఆరబెట్టిన తర్వాతే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలో సాధారణ సాగు విస్తీర్ణం 5,06,110 ఎకరాలు కాగా, ఇందులో 4,39,470 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈసారి సుమారు 1.18 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో 1.36 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి నమో దైంది. మిర్యాలగూడ, నల్లగొండ, దేవరకొండ, చండూరు, చిట్యాల, నకిరేకల్, సాగర్, హాలియా ప్రాంతాల్లో వరికోతలు ఎక్కువగా జరుగుతున్నాయి. ధాన్యం కొనుగో లు సమయంలో మిల్లర్లు కోతలు విధించడం, బస్తాల్లో అధికంగా ధాన్యం నింపాలని ఒత్తిడి చేయడం వంటి చర్యలకు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందని రైతులు కోరుతున్నారు. గత యాసంగిలో ఆన్‌లైన్ ట్రక్‌షీట్ విధానాన్ని ప్రారంభించినప్పటికీ సాంకేతిక సమస్యల కారణంగా మళ్లీ మాన్యువల్ పద్ధతిలోనే ట్రక్‌షీట్‌లు అందించారని, దీంతో మిల్లర్లు నాణ్యతా ప్రమాణాల పేరుతో ఇష్టారాజ్యంగా కోతలు విధించారని రైతులు గుర్తు చేస్తున్నారు. ఈసారి కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత కోసం ఆన్‌లైన్ విధానాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



చంద్రంపేట–మొదటి బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

- మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రజల ధర్నా
- వినతిపత్రం సమర్పణ

ప్రజానావ, సిరిసిల్ల: సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని చంద్రంపేట ఎక్స్ రోడ్డు నుంచి మొదటి బైపాస్‌ను కలుపుతూ 80 అడుగుల రోడ్డు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ప్రజలు ధర్నా నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్డు మంజూరైనా ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదని, దీంతో పంట పొలాలకు వెళ్లే రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు నిర్మాణానికి అడ్డంకులు తొలగించి, పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు వినతిపత్రం అందజేశారు. చంద్రంపేటతో పాటు శ్రీనగర్ కాలనీ, శాంతినగర్ ప్రజలకు ఈ రోడ్డు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. వెంటనే చర్యలు తీసుకోకపోతే రోడ్డుపై టెంట్ వేసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామ్రేడ్ సోమిశెట్టి దశరథం, అన్నారపు శ్రీనివాస్, గుజ్జే దేవదాస్, కొంపెల్లి విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రక్రియ వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్
- సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలెక్టర్ సమీక్ష



ప్రజానావ, సిరిసిల్ల : జిల్లాలో భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. భూముల రీ సర్వే ప్రక్రియ పురోగతిపై జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో కలిసి సమీక్షిత జిల్లా కార్యాలయాల సముదాయంలో మంగళవారం సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లాలో భూముల రీ సర్వే కొనసాగుతున్న ప్రక్రియపై ఆరా తీశారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గ్రామాల సరిహద్దు సర్వే సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, రెవెన్యూ, అటవీ శాఖలు సంయుక్తంగా చేపట్టాలని, భూములకు సంబంధించిన సమాచారం పక్కాగా సేకరించి, నమోదు చేయాలని ఆదేశించారు. సంబంధిత జిల్లా అధికారి, డీఐ లు భూముల రీసర్వే చేపడుతున్న గ్రామాలలో పర్యటించి, ప్రక్రియను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని సూచించారు. లైసెన్సుడ్ సర్వేయర్ల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. భూములకు సంబంధించిన సమాచారం తప్పులు లేకుండా, పకడ్బందీగా సేకరించాలని ఆదేశించారు. సమావే శంలో డీఆర్ఓ జయశ్రీ, ఆర్డీవోలు శ్రీధర్ బాబు, కే ఎస్ బీ కుమారి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్, డీఐలు, సర్వేయర్లు, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

సైబర్ నేరాలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలి: ఎస్పీ మహేష్ బి. గితే



ప్రజానావ, సిరిసిల్ల: పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే సూచించారు. మంగళవారం ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి కేసుల పురోగతి, పెండింగ్ దర్యాప్తులు, స్టేషన్ రికార్డులను సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, రాత్రి వేళల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేయాలని ఆదేశించారు. డయల్ 112 కాల్స్‌కు తక్షణమే స్పందించి బాధితులకు అండగా నిలవాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీలో డీఎస్పీ నాగేంద్రచారి, సీఐ నాగేశ్వరరావు, ఎస్ఐ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

గాంధారి ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ

- అర్ధరాత్రి వేళ దొంగల చేతివాటం..
- ఎంత నగదు అపహరణకు గురైందో తెలియాల్సి ఉంది



ప్రజానావ, గాంధారి : కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎంలో గుర్తుతెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఏటీఎం నుంచి నగదును అపహరించినట్లు సమాచారం. శనివారం అర్ధరాత్రి ఒంటి గంట నుంచి 1.30 గంటల మధ్య ఈ ఘటన జరిగినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఏటీఎం నుంచి దొంగలు ఎంత మొత్తంలో నగదును అపహరించారనే విషయం ఇంకా స్పష్టతకు రాలేదు. ఏటీఎంలో అప్పటివరకు ఎంత నగదు నిల్వ ఉంది, ఎంత మొత్తాన్ని దొంగలు ఎత్తుకెళ్లారనే వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాల కోసం గాంధారి ఎస్సై మహేందర్‌ను ఫోన్‌లో పలుమార్లు సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ స్పందన రాలేదు. పోలీసులు విచారణ చేపట్టి, చోరీ జరిగిన తీరును పరిశీలిస్తేనే ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

ఉచిత ఆరోగ్య పరీక్షలు.. సీపీఆర్‌పై శిక్షణ

- దేశాయిపల్లిలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం
- రక్తదాన శిబిరంలో 21 మంది రక్తదానం..
- క్షయవ్యాధి నివారణపై అవగాహన

ప్రజానావ, రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లి గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో భాగంగా మంగళవారం నాలుగు కార్యక్ర మాలు చేపట్టారు. రక్తదాన శిబిరం, ఉచిత ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధిపై అవగాహన, సీపీఆర్ శిక్షణ కార్యక్రమాల ద్వారా గ్రామస్థులు, విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.



రక్తదాన శిబిరంలో 21 మంది రక్తదానం

భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, గ్రామస్థులు, అధ్యాపకులు కలిపి 21 మంది రక్తదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్మోహన్ మాట్లాడుతూ.. రక్తదానం ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ రక్తదానంపై అవగా హన పెంచుకొని, ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ రవీంద్ర, డాక్టర్ అమూల్య, కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ రజియా సుల్తానా, అధ్యాపకులు పాల్గొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నేరెళ్ల వైద్య సిబ్బంది గ్రామస్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. రక్తంలో చక్కెర స్థాయిలు, రక్తపోటును పరీక్షించి, ఆరోగ్య సమస్యల ను ముందుగానే గుర్తించడం ద్వారా వాటికి తగిన చికిత్స పొందవచ్చని వివరించారు. అనారోగ్య లక్షణాలు కనిపించి నప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.

క్షయవ్యాధి లక్షణాలపై అవగాహన

సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ నాగన్న, డాక్టర్ సంతోష్ క్షయవ్యాధి కారణాలు, వ్యాప్తి, లక్షణాలు, నివారణ, చికిత్స విధానాలపై అవగాహన కల్పించారు. రెండు వారాలు లేదా అంతకంటే ఎక్కువ కాలం దగ్గు కొనసాగడం, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుల ను సంప్రదించి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ చంద్రిక పాల్గొన్నారు.

సీపీఆర్‌తో ప్రాణాలు కాపాడవచ్చు

సిరిసిల్ల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి చెందిన డాక్టర్ ఆశిష్ సీపీఆర్ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) విధానాన్ని ప్రదర్శించి వివరించారు. గుండె స్పందన ఆగిపోయినప్పుడు లేదా బాధితుడు సాధారణంగా శ్వాస తీసుకోనప్పుడు వెంటనే అత్యవసర వైద్య సహాయం అందించి, సీపీఆర్ నిర్వహించడం ద్వారా ప్రాణాలు కాపాడే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రాథమిక చికిత్స అందించే విధానాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కళాశాల ఇన్‌చార్జి అసోసియేట్ డీన్ డాక్టర్ రజియా సుల్తానా మార్గదర్శకత్వంలో, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులైన డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ శ్వేత, డాక్టర్ మాధవి పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు నిర్వహిం చారు. దేశాయిపల్లి సర్పంచ్ కంకణాల రజిత రమేష్ అందిం చిన సహకారంతో శిబిరాన్ని విజయవంతంగా నిర్వహిం చినట్లు నిర్వాహకులు తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ రాజా, డాక్టర్ అశ్విని, డాక్టర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ విద్యార్థులు కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ప్రత్యేక శిబిరం ద్వారా గ్రామస్థులు, విద్యార్థుల్లో రక్తదానం, ఆరోగ్య పరిరక్షణ, క్షయవ్యాధి నివారణ, అత్యవసర సమయాల్లో ప్రాణాలను కాపాడే పద్ధతులపై అవగాహన పెంపొందించారు.

చేపల వలలో భారీ కొండచిలువ

- ఉరుసు రంగ సముద్రం చెరువులో ఘటన
- 7 అడుగుల పొడవు, 15 కిలోల బరువు



ప్రజానావ, వరంగల్ : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుల వలకు భారీ కొండచిలువ చిక్కడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. వరంగల్ పరిధిలోని ఉరుసు రంగ సముద్రం చెరువులో మత్స్యకారులు చేపల కోసం వల వేయగా, అందులో భారీ కొండచిలువ చిక్కింది. చేపలు పడాల్సిన వలలో ఒక్కసారిగా కొండచిలువ కనిపించడంతో మత్స్యకారులు అప్రమత్తమయ్యారు. వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని కొండచిలువను సురక్షి తంగా పట్టుకున్నారు. దానిని జూ పార్కులో వదిలిపెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పట్టుబడిన కొండచిలువ సుమారు 7 అడుగుల పొడవు, 15 కిలోల బరువు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

- డీఎం అండ్ హెచ్ఓ డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్
- లేబరేటరీ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్ లతో సమీక్షా సమావేశం



ప్రజానావ, సిరిసిల్ల : జిల్లాలో జ్వరాల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, జ్వరం కేసులు నమోదవు తున్న గ్రామాల్లో రక్తపు నమూనాల సేకరణను వేగవంతం చేసి, పరీక్షలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఏంజల ఆల్ఫ్రెడ్ సూచించారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపడుతున్న చర్యలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధ్యక్షతన జిల్లాలోని ల్యాబొరేటరీ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించా రు. ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏంజెలా ఆల్ఫ్రెడ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా తదితర సీజనల్ వ్యాధులను తొలిదశలోనే గుర్తించి, అవసరమైన చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జ్వరాలు అధికంగా నమోదవుతున్న గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని, అవసరమైన చోట్ల ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇంటింటి ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. అలాగే వసతి గృహాల్లో క్రమం తప్పకుండా హాస్టల్ చెకప్‌లు నిర్వహించి, విద్యార్థులకు సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించాలని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించా లని, జ్వరాలు, దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించాలని సూచించారు. దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి యాంటీ లార్వల్ చర్యలు, దోమల నియంత్రణ చర్యలు నిరంతరం చేపట్టాలని అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో వైద్య అధికారులు, జిల్లా లోని ల్యాబొరేటరీ టెక్నీషియన్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఇతర ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పలు వార్డుల్లో వేగంగా బతుకమ్మ ఘాట్ల నిర్మాణాలు

- పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి
- పండుగలోపు బతుకమ్మల నిమజ్జనానికి పూర్తయ్యేలా చర్యలు



ప్రజానావ, సిరిసిల్ల : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండు గను ప్రజలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపు కునేలా ప్రజల సౌకర్యార్థం సిరిసిల్ల పరిధిలోని పలు వార్డులలో బతుకమ్మ ఘాట్ లను నిర్మిస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి తెలిపా రు. మంగళవారం సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని 2 వ, 12 వ, 21వ, 38 వ వార్డుల్లో దాదాపు 32 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న బతుకమ్మ ఘాట్ పనులను చైర్ పర్సన్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి మాట్లాడుతూ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఏ నూతన బతుకమ్మ ఘాట్ నిర్మాణాలను ఈ పండగ లోపు పూర్తిచేసి ప్రజలకు అందుబా టులోకి తీసుకువచ్చేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామ న్నారు. అలాగే సిరిసిల్ల పురపాలక సంఘం పరిధిలోని అన్ని బతుకమ్మ ఘాట్ల వద్ద ప్రజలకు ముఖ్యంగా మహిళలకు చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమై లైటింగ్, మంచినీరు, బాగ్లెట్లు, పరిసరాల పరిశుభ్రత ఇలా అన్ని ఏర్పాట్లను చేయడం కోసం 29 లక్షల 50 వేల నిధులతో వివిధ పనులు చేపట్టామని అన్నారు. అలాగే ఈ బతుకమ్మ పండగ నిమర్జనం ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం అధికారులకు సిబ్బందికి విధులు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.డి ఖాదిర్ ఫాషా, సంబంధిత వార్డు కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాంగ్ సమాజ్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి

ఎమ్మెల్యే కోవ లక్ష్మి కి వినతిపత్రం అందజేసిన మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు

ప్రజానావ, ఆసిఫాబాద్ : కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు జైనూరు మండల కేంద్రంలో మాంగ్ సమాజ్ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ మాంగ్ సమాజ్ జిల్లా అధ్యక్షుడు మావాడే దత్త మంగళవారం ఎమ్మెల్యే కోవ లక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లహుజి సాల్వే జీవిత చరిత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యేకు బహూక రించారు. వినతిపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి సానుకూ లంగా స్పందించినట్లు మావాడే దత్త తెలిపారు. సమస్య పరిష్కారానికి పూర్తిస్థాయిలో సహకరిస్తా నని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఆడబీర్షా, ఎంపీడీవో కృష్ణవేణి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనకయ్య యాదవరావు, సర్పంచ్ కొడప ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.



కాకతీయ వర్సిటీ బయోటెక్నాలజీ విభాగాధిపతిగా డాక్టర్ శ్రీనివాస్

- రెండేళ్ల పాటు పదవిలో కొనసాగింపు
- నియామక ఉత్తర్వులు జారీ చేసిన రిజిస్ట్రార్ రామచంద్రం

ప్రజానావ, హనుమకొండ : కాకతీయ విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ విభాగం నూతన అధిపతిగా డాక్టర్ పి.శ్రీనివాస్ నియమితులయ్యారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం మంగళవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీనివాస్ రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగనున్నారు. ప్రస్తుతం విభాగాధిపతిగా ఉన్న టి.శాస్త్రి నుంచి డాక్టర్ పి.శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు.



గాయత్రీ దేవిగా రుద్రేశ్వరీదేవి దర్శనం

- వేయిస్తంభాల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా
- మహా చండీయాగం.. భక్తులకు నిత్యాన్నదానం
- ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన

ప్రజానావ, హనుమకొండ : చారిత్రక రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మూడోరోజు రుద్రేశ్వరీదేవిని గాయత్రీ దేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఐదు రకాల పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. భక్తులు గాయత్రీ మంత్ర పారాయణం చేస్తుండగా, సింహవాహనంపై అమ్మవారి వాహనసేవను మంగళవా యిద్యాలు, మంగళహారతుల నడుమ ఘనంగా నిర్వహించారు. భక్తులు 'రుద్రేశ్వరీదేవికి జై' అంటూ అమ్మవారిని కీర్తించారు. లోకకల్యాణం కోసం, గ్రామం, జిల్లా, రాష్ట్ర ప్రజలను కరువు కాటకాల నుంచి కాపాడాలని ఆకాంక్షిస్తూ గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను మూలమంత్రయుక్తంగా వైదిక పద్ధతిలో నిర్వహించారు. దేవి ఉపాసకులు భరత్ శర్మ 18 అధ్యాయాలతో మహా చండీయాగాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దాతృత్వంతో వేలాది మంది భక్తులకు నిత్యాన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం తాడూరి రేణుక శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. పల్లకిసేవలో నీలం సుహాస్, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు పల్లం రమేష్, కోన శ్రీకర్, బండారి నరేష్, మాడిశెట్టి వరుణ్, సతీష్, నల్లెల లక్ష్మణ్, గుజ్జా సంపత్‌రావు, సౌమ్య దంపతు లు పాల్గొని సేవలందించారు. ఆలయ ఈవో డి.అనిల్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, గంగు మణికంఠశర్మ వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

నిజామాబాద్‌లో భారీ పేలుడు

- మహిళ దుర్మరణం
- చెత్త కుప్పలోని గుర్తుతెలియని వస్తువు చేతిలోకి తీసుకోగానే పేలుడు
- పేలుడు ధాటికి భవనాల అద్దాలు ధ్వంసం
- కిలోమీటరు వరకు వినిపించిన శబ్దం
- బ్యాటరీనా.. మరేదైనా వస్తువా? పోలీసుల దర్యాప్తు



ప్రజానావ, నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మిర్చి కాంపౌండ్ ప్రాంతంలో భారీ పేలుడు కలకలం సృష్టించింది. ఓ ఖాళీ ప్రదేశంలో పేరుకుపోయిన చెత్తలో పనికిరాని వస్తువులను ఏరుకుంటున్న గుర్తుతెలియని మహిళ చేతిలోకి ఓ వస్తువు తీసుకోగానే ఒక్కసారిగా పేలుడు సంభవిం చినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఘటనలో మహిళ శరీర భాగాలు ఛిద్రమై చుట్టుపక్కల ఎగిరిపడ్డాయి. పేలుడు తీవ్రతకు సమీపంలోని భవనాల అద్దాలు సైతం ధ్వంసమయ్యాయి. పేలుడు శబ్దం సుమారు కిలోమీటరు పరిధి వరకు వినిపించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఏం జరిగిందో తెలుసుకునేందుకు ఇళ్ల నుంచి బయటకు వచ్చారు. ఘటన గురించి సమాచారం అందుకున్న నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్ యాదవ్, వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు చుట్టుపక్కల ఎగిరిపడిన మహిళ శరీర భాగాలను పోలీసులు సేకరించారు. పేలుడు ఏదైనా బ్యాటరీ కారణంగా సంభవించిందా? లేక చెత్తలో ఉన్న మరేదైనా వస్తువు పేలిందా? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ ప్రకాశ్ యాదవ్ తెలిపారు. పేలుడు ధాటికి మహిళ శరీరం తీవ్రంగా ఛిద్రమవడంతో ఆమె ఆనవాళ్లను గుర్తించడం కూడా కష్టంగా మారింది. మృతురాలు ఎవరనే విషయాన్ని తెలుసుకునేందుకు పోలీసులు విచారణ చేపట్టారు. ఈ ఘటనపై వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



హార్ముజ్ జలసంధిలో భారతీయ నావికులపై ముప్పు

- చమురు నౌకపై డ్రోన్ దాడి
- ఇద్దరు భారతీయులు గల్లంతు
- మరో నౌకపైనా క్షిపణి దాడి
- 11 మంది నావికుల భద్రతపై ఆరా
- దాడులను తీవ్రంగా ఖండించిన భారత్

టెహ్రాన్ : హార్ముజ్ జలసంధిలో చమురు నౌకలపై జరిగిన దాడులు కలకలం రేపాయి. ఆదివారం ఎంటీ పెట్రో డాల్ఫిన్ నౌకపై డ్రోన్ దాడి జరిగినట్లు సమాచారం. నికరగువ జెండాతో ప్రయాణిస్తున్న ఈ నౌకపై ఒమన్‌లోని సోహార్ నౌకాశ్రయం సమీపంలో దాడి జరిగినట్లు తెలుస్తోంది. ఈ నౌకలో 11 మంది భారతీయ నావికులు ఉండగా, వారిలో తొమ్మిది మందిని రక్షించారు. మరో ఇద్దరు గల్లంతయ్యారు. గల్లంతైన నావికుల కోసం స్థానిక సంస్థల సహకారంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. వారి ఆచూకీ కనుగొనేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపింది.

మరో నౌకపైనా క్షిపణి దాడి

మార్షల్ ఐలాండ్స్ జెండాతో ప్రయాణిస్తున్న ఎంటీ వాల్టెరా నౌకపై కూడా క్షిపణి దాడి జరిగినట్లు సమాచారం. ఈ నౌకలోనూ 11 మంది భారతీయ నావికులు ఉన్నట్లు తెలుస్తోంది. వారి భద్రతపై ఆరా తీస్తున్నట్లు కేంద్ర మంత్రి సర్బానంద వెల్లడించారు.

దాడులను ఖండించిన భారత్

ఈ దాడులకు పాల్పడింది ఎవరనే విషయం ఇంకా వెల్లడికాలేదు. పౌర నౌకలు, ఇంధన రవాణా నౌకలపై దాడులు జరగడంపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ వాటిని ఖండించింది. పౌర నౌకలు, ఇంధన నౌకలపై దాడులను తక్షణమే నిలిపివేయాలని సూచించింది. హార్ముజ్ జలసంధిలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో భారతీయ నావికుల భద్రతపై అధికారులు దృష్టి సారించారు.

సాహిల్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదు

- ఐఐటీ బాంబే వెల్లడి
- కాపీయింగ్‌పై కఠిన నిబంధనల ఉపసంహరణ
- ఎలక్ట్రానిక్ పరికరాలతో కాపీ కొడితే ఫెయిల్, సస్పెన్షన్ నిబంధనలో మార్పులు

ముంబై : గత నెల 18న సాహిల్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై ఐఐటీ బాంబే స్పందించింది. అతడి మరణానికి ముందు ఎలాంటి క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదని సంస్థ తెలిపినట్లు ఓ పోలీసు అధికారి వెల్లడించారు. పరీక్షల్లో కాపీ కొట్టేందుకు ఎలక్ట్రానిక్ పరికరాలను ఉపయోగించే విద్యార్థులకు ఫెయిల్ గ్రేడ్ ఇవ్వడంతోపాటు ఒక సెమిస్టర్ పాటు సస్పెండ్ చేయడాన్ని తప్పనిసరి చేసే కఠిన నిబంధనలను ఆగస్టులోనే ఉపసంహరించుకున్నట్లు ఐఐటీకి చెందిన పది మంది సభ్యుల కమిటీ తమకు తెలిపిందని సదరు అధికారి పేర్కొన్నారు.

భారత సైన్యానికి 450 నాగాస్త్ర డ్రోన్లు

ఒకేసారి భారీ సంఖ్యలో డ్రోన్ల సరఫరా



న్యూఢిల్లీ : భారత సైనిక బలగాల అమ్ములపొదిలోకి మరో అధునాతన ఆయుధ వ్యవస్థ చేరింది. సోలార్ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (ఎస్‌డీఏఎల్) సంస్థ 450 నాగాస్త్ర–1ఆర్ డ్రోన్లను భారత సైన్యానికి అందించింది. ఇవి లక్ష్యాన్ని ఢీకొని పేలిపోయే రకం కావడంతో వీటిని 'కమికాజి' లేదా సూసైడ్ డ్రోన్లుగా పిలుస్తారు. తక్కువ దూరంలోని శత్రు లక్ష్యాలపై కచ్చితంగా దాడి చేసేందుకు వీటిని వినియోగించవచ్చు. ఒకే సంస్థ నుంచి ఇంత పెద్ద సంఖ్యలో డ్రోన్లు ఒకేసారి సైన్యానికి అందడం ఇదే తొలిసారిగా పేర్కొంటున్నారు.

అత్యవసర కొనుగోళ్లలో భాగంగా సరఫరా

ఎస్‌డీఏఎల్ సంస్థ సోలార్ ఇండస్ట్రీస్ ఇండియాకు అనుబంధంగా పనిచేస్తోంది. అత్యవసర కొనుగోళ్లలో భాగంగా భారత సైన్యం ఈ డ్రోన్లను సమకూర్చుకుంది. గత ఏడాది మార్చిలో ఈ డ్రోన్ల తయారీ కోసం పలు సంస్థలను సైన్యం ఆహ్వానించింది. అయితే నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా నాగాస్త్ర–1ఆర్ డ్రోన్లను తయారు చేయగలిగిన ఎస్‌డీఏఎల్ సంస్థ టెండర్‌ను దక్కించుకుంది. తాజాగా 450 డ్రోన్లను సైన్యానికి అందించింది.

దాడి చేయడమే కాదు.. వెనక్కి రాగలవు

నాగాస్త్ర–1ఆర్ డ్రోన్ల ప్రత్యేకత వాటి కార్యకలాపాల సామర్థ్యంలో ఉంది. నిర్దేశిత లక్ష్యంపై దాడి చేయగలిగే ఈ డ్రోన్లు, అవసరమైన పరిస్థితుల్లో ప్రయాణం మధ్యలోనే వెనక్కి తిరిగివచ్చే సామర్థ్యాన్ని కూడా కలిగి ఉన్నట్లు సమాచారం. సురక్షితంగా తిరిగి వచ్చి ల్యాండ్ అయ్యే విధంగా వీటిని రూపొందించారు. సాధారణంగా లక్ష్యంపై దాడి చేసేందుకు ప్రయోగించిన సూసైడ్ డ్రోన్లను తిరిగి వినియోగించడం సాధ్యం కాదు. అయితే ఈ తరహా డ్రోన్లలో మిషన్‌ను మధ్యలో నిలిపివేసి వెనక్కి రప్పించే అవకాశం ఉండటం ప్రత్యేకతగా చెప్పవచ్చు.

దేశీయ తయారీతో తగ్గనున్న భారం

ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో యుద్ధాలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఆధునిక ఆయుధాల కొనుగోలు దేశాలపై ఆర్థిక భారాన్ని పెంచుతోంది. ఈ పరిస్థితుల్లో దేశీయంగా ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేసి తయారు చేసుకోవడం కీలకంగా మారింది. స్వదేశీ సంస్థల ద్వారా డ్రోన్ల వంటి ఆధునిక ఆయుధాలను సమకూర్చుకోవడం వల్ల దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంతోపాటు ఖర్చులను నియంత్రించే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎస్‌డీఏఎల్ సంస్థ మరిన్ని ఆధునిక రక్షణ, వైమానిక సాంకేతిక వ్యవస్థలను తయారు చేసేందుకు సిద్ధమవుతోంది.

కేంద్ర మంత్రి మురుగన్ రాజీనామా

- తమిళనాడులో బీజేపీ బలోపేతమే లక్ష్యం
- క్షేత్రస్థాయి రాజకీయాలపై దృష్టి సారిస్తానని వెల్లడి
- దీపావళికి ముందే కేంద్ర మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ?



న్యూఢిల్లీ : కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ రాజీనామాతో కేంద్ర మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది. 2029 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని తమిళనాడులో బీజేపీని బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయి రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనాలని నిర్ణయించుకున్నట్లు ఆయన తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో మంత్రిగా పనిచేయడం తన జీవితంలో లభించిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. ఇకపై రాష్ట్రంలో పార్టీని పటిష్ఠం చేసేందుకు కార్యకర్తలతో కలిసి పూర్తిస్థాయిలో పనిచేయనున్నట్లు వెల్లడించారు.

మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణపై చర్చ

మురుగన్ రాజీనామా నేపథ్యంలో కేంద్ర మంత్రివర్గంలో మార్పులపై ఊహాగానాలు మొదలయ్యాయి. దీపావళికి ముందే ఎప్పుడైనా మంత్రివర్గ పునర్‌వ్యవస్థీకరణ జరిగే అవకాశముందని ప్రభుత్వ వర్గాలు తెలిపినట్లు సమాచారం. కనీసం ఆరు మంత్రి పదవులు ఖాళీ అయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఎవరికి అవకాశం దక్కుతుంది? ప్రస్తుత మంత్రుల్లో ఎవరికి బాధ్యతలు మారుతాయి? అనే అంశాలపై రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

ఇండియా కూటమిలో మళ్లీ లుకలుకలు

- ఎన్నికల సంఘంపై పిటిషన్.. 11 పార్టీల సంతకాలు
- సుప్రీంకోర్టు పిటిషన్‌కు ఆప్, డీఎంకే దూరం
- జ్ఞానేశ్ కుమార్ రాజీనామా కోరిన పార్టీల్లోనూ భిన్నాభిప్రాయాలు



న్యూఢిల్లీ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏర్పాటైన ఇండియా కూటమిలో విభేదాలు కొనసాగుతున్నాయి. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా, ఎన్నికల సంఘం పనితీరులో అవకతవకలు జరుగుతున్నాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో ప్రతిపక్ష పార్టీలు సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ఈ పిటిషన్‌పై 11 ప్రతిపక్ష పార్టీలు సంతకాలు చేయగా, నాలుగు పార్టీలు దూరంగా ఉండటం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇండియా కూటమిలో భాగస్వాములైన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్), డీఎంకేలు కూడా పిటిషన్‌పై సంతకాలు చేయకపోవడం కూటమిలో అంతర్గత విభేదాలను మరోసారి తెరపైకి తెచ్చింది.

పిటిషన్‌కు దూరంగా కీలక పార్టీలు

ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్, డీఎంకే అధినేత ఎం.కె. స్టాలిన్ నేతృత్వంలోని పార్టీలు ఈ పిటిషన్‌కు దూరంగా ఉన్నాయి. మరోవైపు ఇండియా కూటమిలో భాగస్వాములు కాకపోయినా, బీజేపీకి ప్రత్యర్థి పార్టీలుగా ఉన్న బిజూ జనతాదళ్ (బీజేడీ), తమిళగ వెట్రి కళగం (టీవీకే) కూడా పిటిషన్‌లో భాగస్వాములు కాలేదు. ఈ పార్టీలన్నీ గతంలో జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసినప్పటికీ, సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసే సమయంలో వెనక్కి తగ్గడం గమనార్హం.

కాంగ్రెస్–డీఎంకే మధ్య దూరం

తమిళనాడులో కాంగ్రెస్, డీఎంకే మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. విజయ్ నేతృత్వంలోని టీవీకేకు కాంగ్రెస్ మద్దతు ఇవ్వడం, ప్రభుత్వంలో భాగస్వామిగా మారడం వంటి పరిణామాలతో డీఎంకేకు కాంగ్రెస్ మరింత దూరమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో డీఎంకే సుప్రీంకోర్టు పిటిషన్‌కు దూరంగా ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు పలు రాష్ట్రాల్లో ఆప్, కాంగ్రెస్ మధ్య కూడా రాజకీయ విభేదాలు న్నాయి. ఈ కారణాలతో ఆప్ ఇండియా కూటమి సమావేశాలకు దూరంగా ఉంటున్నట్లు తెలుస్తోంది. తాజాగా ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌లోనూ ఆప్ పాల్గొనకపోవడం ఈ విభేదాలకు మరింత బలాన్నిచ్చింది.

బీజేడీ వైఖరిపైనా చర్చ

ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ కూడా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వ్యతిరేకిస్తున్నారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ఆయన పార్టీ ఎంపీలు ఇటీవల నిర్వహించిన ర్యాలీలోనూ పాల్గొన్నారు. అయినప్పటికీ తాజా పిటిషన్‌కు బీజేడీ దూరంగా ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఎన్నికల సంఘం వ్యవహారంపై ప్రతిపక్షాలు ఉమ్మడి పోరాటానికి సిద్ధమవుతున్న వేళ, కీలక పార్టీలు ఒక్కొక్కటిగా దూరంగా ఉండటం ఇండియా కూటమి ఐక్యతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా ఒకే వేదికపైకి వచ్చిన పార్టీలు ఎన్నికల అంశంలోనూ ఏకాభిప్రాయంతో ముందుకు సాగుతాయా? అన్నది ఆసక్తికరంగా మారింది.

సౌదీకి ఇండిగో విమాన సర్వీసులు రద్దు

- హౌతీల దాడుల నేపథ్యంలో కీలక నిర్ణయం
- అక్టోబర్ 17 వరకు విమానాల రాకపోకలు నిలిపివేత
- రియాద్, జెద్దా, దమ్మాం, మదీనా సర్వీసులపై ప్రభావం



సౌదీ అరేబియా : సౌదీ అరేబియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇండిగో విమానయాన సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ నుంచి సౌదీ అరేబియాకు, అక్కడి నుంచి భారత్‌కు నడిపే విమాన సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని, అక్టోబర్ 17 వరకు కొనసాగుతుందని వెల్లడించింది. ఈ నిర్ణయంతో సౌదీ అరేబియా రాజధాని రియాద్‌తో పాటు జెద్దా, దమ్మాం, మదీనా విమానాశ్రయాల నుంచి భారత్‌కు, భారత్ నుంచి ఆయా విమానాశ్రయాలకు ఇండిగో విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. ప్రాంతంలో నెలకొన్న భద్రతాపరమైన ఆందోళనల నేపథ్యంలో ప్రయాణికుల సంక్షేమం, భద్రతను దృష్టిలో ఉంచుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది.

ప్రయాణికులకు సూచనలు

విమాన సర్వీసుల రద్దు విషయాన్ని ఇండిగో ప్రయాణికులకు తెలియజేసింది. విమానాల తాజా పరిస్థితి, ప్రయాణానికి సంబంధించిన పూర్తి వివరాల కోసం సంస్థ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది. ప్రయాణికుల సందేహాలు, అభ్యంతరాలకు సమాధానాలు ఇచ్చేందుకు తమ సహాయక బృందం అందుబాటులో ఉంటుందని పేర్కొంది.

విమానాశ్రయాలపై దాడుల ఆందోళన

సౌదీ అరేబియాలోని విమానాశ్రయాలను లక్ష్యంగా చేసుకుని హౌతీ తిరుగుబాటుదారులు దాడులకు పాల్పడుతున్నట్లు వార్తలు వెలువడుతున్నాయి. బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్లతో దాడులు జరుగుతున్నాయన్న సమాచారంతో విమానయాన రంగంలో ఆందోళన నెలకొంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఇండిగోతో పాటు ఇతర విమానయాన సంస్థలు కూడా కొన్ని ప్రాంతాలకు విమాన సర్వీసులను నిలిపివేసినట్లు సమాచారం. యెమెన్‌లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్న హౌతీ తిరుగుబాటుదారులకు ఇరాన్ మద్దతుగా నిలుస్తుండ గా, సౌదీ అరేబియా యెమెన్ ప్రభుత్వా నికి అండగా ఉంటోంది. ఈ ప్రాంతంలో కొనసాగు తున్న ఉద్రిక్త తల ప్రభావం విమాన రాకపోకలపై పడుతోంది. ప్రయాణికులు విమానాశ్రయాలకు బయలుదేరే ముందు తమ విమాన సర్వీసుల తాజా స్థితిని అధికారిక మార్గాల ద్వారా నిర్ధారించుకోవడం అవసరం.

మమతా బెనర్జీపై హత్యాయత్నం?

- చీర లాగేందుకు యత్నించిన మహిళ
- కత్తి ఉన్నట్లు టీఎంసీ ఆరోపణ
- అప్రమత్తమైన పార్టీ శ్రేణులు
- పోలీసులకు అప్పగింత



పశ్చిమ బెంగాల్ : మాజీ ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీపై హత్యాయత్నం జరిగినట్లు ఆ పార్టీ నేతలు ఆరోపించారు. కోల్‌కతాలోని కాళీఘాట్ ప్రాంతం లో ఉన్న ఆమె నివాసం వెలుపల ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలిపారు. దుర్గాపూజ మండపం ప్రారంభోత్సవానికి మమతా బెనర్జీ బయలుదేరు తున్న సమయంలో ఓ మహిళ ఆమె వద్దకు వచ్చి చీర లాగేందుకు ప్రయత్నించిందని టీఎంసీ నేతలు పేర్కొన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ యువతి మమతా బెనర్జీ నివాసం వద్దకు చేరుకుంది. ఆమె మమత చీరను లాగేందుకు ప్రయత్నించడంతో అక్కడున్నవారు అప్రమత్తమ య్యారు. సదరు మహిళ తన చీరలో కత్తిని దాచినట్లు గుర్తించామని టీఎంసీ శ్రేణులు ఆరోపించాయి. వెంటనే ఆమెను పట్టుకుని కాళీఘాట్ పోలీసులకు అప్పగించినట్లు వెల్లడించాయి. ఈ ఘటనపై పోలీసుల విచారణ, అధికారిక వివరాలు తెలియాల్సి ఉంది.

మస్క్‌పై బెర్నీ సాండర్స్ ఎదురుదాడి

- ట్రంప్ ఎన్నికల ప్రచారానికి 290 మిలియన్ డాలర్లు ఖర్చు
- కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల పట్టు కోసం మరో 366 మిలియన్ డాలర్లు
- 'కుబేరుల రాజ్యానికి ముగింపు పలకాలి' అంటూ విమర్శలు

వాషింగ్టన్ : భారత్‌లో స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవల ప్రారంభానికి అనుమతుల జాప్యంపై విమర్శలు చేస్తున్న ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌పై అమెరికా సెనెటర్ బెర్నీ సాండర్స్ ఎదురుదాడికి దిగారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎన్నికల ప్రచారం కోసం మస్క్ 290 మిలియన్ డాలర్లు ఖర్చు చేశారని సాండర్స్ వెల్లడించారు. ఆ ఖర్చుకు తగిన ప్రతిఫలం లభించిందన్నట్లుగా వ్యాఖ్యానిస్తూ, అనంతరం మస్క్ సంపద 696 బిలియన్ డాలర్లు (సుమారు రూ.66 లక్షల కోట్లు) పెరిగిందని విమర్శించారు. దీంతో ఆయన ప్రపంచంలోనే తొలి ట్రిలియనీర్‌గా మారారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. మస్క్ రాజకీయా ల్లో మరింతగా జోక్యం చేసుకుంటున్నారని సాండర్స్ ఆరోపించారు. అమెరికా కాంగ్రెస్‌లో రిపబ్లికన్ల ఆధిపత్యం కొనసాగించేందుకు మస్క్ 366 మిలియన్ డాలర్లు ఖర్చు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 'మస్క్‌ను ఆపండి.. కుబేరుల రాజ్యానికి ముగింపు పలకండి' అంటూ ఆయన నినదించారు.

స్టార్‌లింక్ అనుమతులపై మస్క్ ఆరోపణలు

భారత్‌లో స్టార్‌లింక్ ఉపగ్రహ ఇంటర్నెట్ సేవలు ప్రారంభం కాకుండా కొందరు సంపన్న వ్యాపారవేత్తలు అడ్డుకుంటున్నారని మస్క్ ఇటీవల ఆరోపించారు. దేశంలో తమ గుత్తాధిపత్యాన్ని కాపాడుకునేందుకే వారు ప్రయత్నిస్తున్నారని వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రచారాన్ని సామాజిక మాధ్యమాల్లో విస్తృతం చేసేందుకు అవసరమైన నిధులను రిలయన్స్‌తో సంబంధం ఉన్న ఓ కంపెనీ సమకూర్చిందంటూ వచ్చిన మీడియా కథనాలను కూడా ఆయన పంచుకున్నారు. ఈ నేపథ్యంలో మస్క్ రాజకీయ ఖర్చులు, సంపద పెరుగుదలను ప్రస్తావిస్తూ సాండర్స్ విమర్శలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

కాంగ్రెస్ ఎంపీని సస్పెండ్ చేయాలి

రాష్ట్రపతి ముర్మును కలిసిన బీజేపీ మహిళా ఎంపీలు

న్యూఢిల్లీ : లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ఎంపీ అంగోమ్చా బిమోల్ అకోయిజంను లోక్‌సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ బీజేపీ మహిళా ఎంపీలు రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఆశ్రయించారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మంగళవారం ఆమెను కలిసిన మహిళా ఎంపీల బృందం.. ఈ మేరకు విజ్ఞప్తి చేసింది. బీజేపీ ఎంపీ డి. పురందేశ్వరి నేతృత్వంలో వెళ్లిన ఈ బృందంలో ఢిల్లీ ఎంపీ బన్సూరి స్వరాజ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థినుల ఫిర్యాదుతో విచారణ

మణిపూర్ నుంచి కాంగ్రెస్ ఎంపీగా ఎన్నికైన అంగోమ్చా బిమోల్ అకోయిజం.. ఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (జేఎన్‌యూ)లో ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆయనపై గత మే నెలలో విద్యార్థినుల నుంచి లైంగిక వేధింపుల ఫిర్యాదులు అందినట్లు సమాచారం. విద్యార్థినులను తన ఇంటికి పిలిపించి, అనంతరం అసభ్యంగా ప్రవర్తించేవారని బాధితులు ఆరోపించినట్లు కథనాలు వెలువడ్డాయి. ఈ ఫిర్యాదులపై విశ్వవిద్యాలయ అంతర్గత కమిటీ విచారణ చేపట్టింది. విచారణ అనంతరం లైంగిక వేధింపులకు పాల్పడినట్లు నిర్ధారణకు వచ్చామని పేర్కొంటూ, అంగోమ్చాను ప్రొఫెసర్ విధుల నుంచి తొలగించినట్లు విశ్వవిద్యాలయం ప్రకటించింది. తదుపరి చట్టపరమైన చర్యలకు కూడా సిఫారసు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ఆయనపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మహిళా ఎంపీలు రాష్ట్రపతిని కోరారు.

కాంగ్రెస్ కార్యాలయం ఎదుట నిరసన

ఈ వ్యవహారంపై బీజేపీ మహిళా విభాగం ఆందోళనలను కూడా చేపట్టింది. హిమాచల్‌ప్రదేశ్‌లో బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో నిరసన నిర్వహించగా, ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఎదుట కూడా ఆ పార్టీ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ నిరసనలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణా దేవి పాల్గొన్నారు.

ఢిల్లీ పోలీసుల కేసు నమోదు

మరోవైపు ఈ వ్యవహారంలో ఢిల్లీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జేఎన్‌యూ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. విశ్వవిద్యాలయ విచారణ, పోలీసుల దర్యాప్తు నేపథ్యంలో ఈ అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఎంపీని లోక్‌సభ నుంచి సస్పెండ్ చేయాలన్న బీజేపీ మహిళా ఎంపీల విజ్ఞప్తిపై రాష్ట్రపతి కార్యాలయం నుంచి ఎలాంటి స్పందన వచ్చిందన్నది తెలియాల్సి ఉంది.

పాకిస్థాన్‌లో ఘోర రైలు ప్రమాదం

- పట్టాలు తప్పిన రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్
- ఆరుగురు మృతి.. మరో 30 మందికి గాయాలు
- 14 బోగీలు పట్టాలు తప్పడంతో నిలిచిన రైళ్ల రాకపోకలు

పాకిస్థాన్ : పాకిస్థాన్‌లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. పంజాబ్ ప్రావిన్స్‌లో మంగళవారం ఉదయం ప్రయాణికుల రైలు పట్టాలు తప్పడంతో ఆరుగురు దుర్మరణం చెందగా, మరో 30 మంది గాయపడ్డారు. కరాచీ నుంచి పెషావర్‌కు వెళ్తున్న రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్.. ముల్తాన్‌లోని షేర్ షా బ్రిడ్జి సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో రైలుకు చెందిన 14 బోగీలు పట్టాలు తప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రమాదంలో మృతి చెందిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిని సమీపంలోని వివిధ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదం కారణంగా ఆ మార్గంలో రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే అధికారులు సహాయక చర్యలు చేపట్టి, దెబ్బతిన్న మార్గంలో రైళ్ల రాకపోకలను పునరుద్ధరించేందుకు పనులు కొనసాగిస్తున్నారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.



మహారాష్ట్రలో నీటి ఎమర్జెన్సీ!

- నీటిని వృథా చేస్తే రూ.5 వేల జరిమానా
- నాగ్‌పూర్‌లో కఠిన నిబంధనలకు సిద్ధం
- పుణేలో అక్టోబర్ 15 నుంచి వారానికి ఒకరోజు నీటి సరఫరా బంద్



ప్రజానావ,, ముంబై : మహారాష్ట్రలో నీటి కొరత తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తక్కువగా కురవడం, జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గిపోవడంతో నాగ్‌పూర్, పుణే వంటి ప్రధాన నగరాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించేందుకు అక్కడి స్థానిక పాలక వర్గాలు కఠిన చర్యలకు సిద్ధమవుతున్నాయి. నీటిని వృథా చేసే వారిపై రూ.5 వేల జరిమానా విధించే ప్రతిపాదనను నాగ్‌పూర్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసీ) పరిశీలిస్తోంది. మరోవైపు పుణేలో అక్టోబర్ 15 నుంచి ప్రతి గురువారం నీటి సరఫరా నిలిపివేయాలని నిర్ణయించినట్లు సమాచారం.

నీటి వృథాపై కొరడా

నాగ్‌పూర్‌లో నీటి కొరతపై మేయర్ నీతా తకరే అధికారులతో సమీక్ష నిర్వహించారు. నగరానికి అందుబాటులో ఉన్న నీటి నిల్వలు, సరఫరా పరిస్థితులను పరిశీలించి, నీటిని సమర్థంగా వినియోగించే చర్యలపై చర్చించారు. ఇందులో భాగంగా తాగునీటిని వాహనాల శుభ్రతకు ఉపయోగించడం, రోడ్లు కడగడం, ఇళ్ల అరుగులపై నీళ్లు చల్లడం వంటి పనులకు వినియోగించడాన్ని నియంత్రించాలని భావిస్తున్నారు. ఉద్యానవనాలు, నిర్మాణ రంగంలో నీటి వినియోగంపైనా పరిమితులు విధించే అంశాన్ని పరిశీలిస్తున్నారు. నిబంధనలను ఉల్లంఘించి నీటిని వృథా చేస్తే ఒక్కో ఉల్లంఘనకు రూ.5 వేల చొప్పున జరిమానా విధించే ప్రతిపాదనను ముందుకు తెచ్చారు.

58 శాతానికే జలాశయాల నిల్వలు

నాగ్‌పూర్‌కు నీటిని సరఫరా చేసే జలాశయంలో ప్రస్తుతం 746 మిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉన్నట్లు సమాచారం. ఇది జలాశయం పూర్తి సామర్థ్యంలో 58 శాతమే. ఇటీవల వర్షాలు సరిగా కురవకపోవడంతో నీటి నిల్వలు తగ్గిపోయాయి. దీంతో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగరంలో నీటి రేషనింగ్ అమలు చేయాలా? అనే అంశాన్ని కూడా ఎన్ఎంసీ పరిశీలిస్తోంది.

పుణేలో వారానికి ఒకరోజు కోత

మహారాష్ట్రలోని మరో ప్రధాన నగరమైన పుణేలోనూ నీటి కొరతను ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అక్టోబర్ 15 నుంచి ప్రతి గురువారం నీటి సరఫరాను నిలిపివేయనున్నట్లు సమాచారం. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని అధికారులు సూచిస్తున్నారు. అక్రమంగా నీటిని వినియోగించే వారిపై చర్యలు తీసుకోవాలని కూడా భావిస్తున్నారు. వేసవి కాలం ప్రారంభం కాకముందే నీటి కొరత తీవ్రతరం కావడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. రానున్న వేసవిలో పరిస్థితులు మరింత దిగజారితే తాగునీటి కోసం ఇబ్బందులు తప్పవనే భయాలు వ్యక్తమవుతున్నాయి. అందుబాటులో ఉన్న నీటిని వృథా చేయకుండా వినియోగించుకోవడమే ఈ సమస్యను కొంతవరకు ఎదుర్కొనే మార్గమని అధికారులు భావిస్తున్నారు.

హేజిల్‌వుడ్ ధాటికి దక్షిణాఫ్రికా చిత్తు

- డర్బన్ టెస్టులో ఆస్ట్రేలియా ఘన విజయం



డర్బన్: జోష్ హేజిల్‌వుడ్ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో దక్షిణాఫ్రికా పతనాన్ని శాసించాడు. కింగ్స్‌మీడ్ వేదికగా జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా 214 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది. చివరి రోజు మంగళవారం హేజిల్‌వుడ్ కెరీర్‌లోనే అత్యుత్తమంగా 49 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టడంతో.. 421 పరుగుల లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 206 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో ఆ జట్టు 284 పరుగులు చేసింది. రెండో కొత్త బంతి తీసుకున్న ఐదు ఓవర్లలోపే ఆసీస్ మ్యాచ్‌ను ముగించింది. ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 390 పరుగులు చేయగా, మాట్ రెన్షా 190 పరుగులతో కీలక పాత్ర పోషించాడు. రెండో ఇన్నింగ్స్‌ను 314/6 వద్ద డిక్లేర్ చేసిన ఆసీస్ తరఫున రెన్షా 82 పరుగులు చేశాడు. పార్ట్‌టైమ్ స్పిన్‌తో రెండో ఇన్నింగ్స్‌లోనూ రెండు వికెట్లు తీసి తన టెస్టు కెరీర్‌లో తొలిసారిగా వికెట్ల ఖాతా తెరిచాడు.

మార్క్‌రమ్ పోరాటం వృథా

దక్షిణాఫ్రికా ఓపెనర్ ఐడెన్ మార్క్‌రమ్ 237 బంతుల్లో 75 పరుగులు చేసి దాదాపు ఆరు గంటలపాటు పోరాడినా జట్టును ఓటమి నుంచి గట్టెక్కించలేకపోయాడు. వియాన్ ముల్డర్ (29)తో కలిసి ఆసీస్ బౌలర్లను అడ్డుకున్నాడు. హేజిల్‌వుడ్ ఈ భాగస్వామ్యాన్ని విడదీసిన తర్వాత కైల్ వెరెయిన్నె (1)ను రెన్షా పెవిలియన్‌కు పంపాడు. స్టీవ్ స్మిత్ స్లిప్స్‌లో క్యాచ్ అందుకున్నాడు. హెల్మెట్‌కు బంతి తగలడంతో సోమవారం మైదానాన్ని వీడిన స్మిత్.. వైద్య పరీక్షల్లో అనుమతి లభించడంతో చివరి రోజు ఫీల్డింగ్‌కు వచ్చాడు. లంచ్ సమయానికి 69 పరుగులతో ఉన్న మార్క్‌రమ్.. కొత్త బంతి తీసుకున్న తర్వాత సహచరులను వేగంగా కోల్పోయాడు. మార్కో జాన్సెన్ (35), సైమన్ హార్మర్‌లను ఒకే ఓవర్‌లో హేజిల్‌వుడ్ ఔట్ చేశాడు. ఆ తర్వాతి ఓవర్‌లో మార్క్‌రమ్‌ను మిచెల్ స్టార్క్ క్యాచ్‌తో వెనక్కి పంపగా, మరుసటి ఓవర్‌లో ఆరో వికెట్ తీసి మ్యాచ్‌ను ముగించాడు. రెన్షా రెండు వికెట్లు తీయగా, స్టార్క్, పాట్ కమిన్స్ చెరో వికెట్ సాధించారు. మూడు టెస్టుల సిరీస్‌లో రెండో మ్యాచ్ ఆదివారం గ్కెబెర్హాలో ప్రారంభం కానుంది.

ఢిల్లీ బ్యాటింగ్, అసిస్టెంట్ కోచ్‌గా యువీ



- 2027 ఐపీఎల్ సీజన్‌కు ముందు కీలక నియామకాలు

న్యూఢిల్లీ: భారత మాజీ ఆల్‌రౌండర్, ప్రపంచకప్ విజేత యువరాజ్ సింగ్‌ను ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్, బ్యాటింగ్ కోచ్‌గా నియమించింది. 2027 ఐపీఎల్ సీజన్‌కు ముందు ఈ నిర్ణయం తీసుకుంది. వారం క్రితమే మాజీ భారత కెప్టెన్ సౌరవ్ గంగూలీని హెడ్ కోచ్‌గా ప్రకటించిన ఢిల్లీ ఫ్రాంచైజీ.. ఇప్పుడు యువరాజ్‌కు బాధ్యతలు అప్పగించింది. ఈ ఇద్దరి నియామకాలపై జూన్‌లోనే పీటీఐ కథనం ప్రచురించింది. భారత్ తరఫున 304 వన్డేలు, 40 టెస్టులు, 58 టీ20లు ఆడిన యువరాజ్‌కు ఐపీఎల్‌లో కోచ్‌గా ఇదే తొలి అవకాశం. ఢిల్లీ జట్టుతో తనకు గతంలోనూ అనుబంధం ఉందని, యాజమాన్యంతో పరిచయాలు ఈ అవకాశాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయని ఆయన పేర్కొన్నారు. గంగూలీతో కలిసి కోచ్‌గా పనిచేయడం, ప్రతిభావంతులైన ఆటగాళ్లతో కూడిన జట్టు విజయానికి తోడ్పడటం కోసం ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. 2015లో అప్పటి ఢిల్లీ డేర్‌డెవిల్స్ ఫ్రాంచైజీ యువరాజ్‌ను రూ.16 కోట్ల రికార్డు ధరకు కొనుగోలు చేసింది. అప్పట్లో ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన ఆటగాడిగా నిలిచిన ఆయన.. ఆ సీజన్‌లో జట్టు తరఫున మొత్తం 14 మ్యాచ్‌లూ ఆడారు.

యువ ఆటగాళ్లకు మార్గదర్శకుడు

టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ, ప్రభ్‌సిమ్రన్ సింగ్ వంటి పలువురు యువ ఆటగాళ్లకు యువరాజ్ మార్గదర్శకత్వం వహించారు. ఫామ్ కోల్పోయిన సమయంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ కూడా ఆయన సలహాలు తీసుకున్నాడు. లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆటగాళ్ల మార్పిడి ఒప్పందంలో భాగంగా పంత్ తిరిగి ఢిల్లీ క్యాపిటల్స్‌కు చేరగా, స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మరోవైపు లక్నో జట్టులోకి వెళ్లాడు. యువరాజ్ అనుభవం, విజయాలపై ఆయనకున్న పట్టుదల, యువ ఆటగాళ్లతో కలిసిపోయే తత్వం జట్టుకు ఎంతో ఉపయోగపడతాయని ఢిల్లీ క్యాపిటల్స్ చైర్మన్, సహ యజమాని, జేఎస్‌డబ్ల్యూ స్పోర్ట్స్ వ్యవస్థాపకుడు పార్థ్ జిందాల్ పేర్కొన్నారు. గంగూలీతో కలిసి ఆయన పనిచేయడం ఫ్రాంచైజీకి ప్రత్యేకమని తెలిపారు. ఐపీఎల్‌లో ఇప్పటివరకు ఢిల్లీ క్యాపిటల్స్ ఒక్కసారి కూడా టైటిల్ సాధించలేదు. 2020లో ఒక్కసారి మాత్రమే ఫైనల్‌కు చేరిన ఆ జట్టు.. గత రెండు సీజన్లలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించలేకపోయింది. జీఎంఆర్, జేఎస్‌డబ్ల్యూ గ్రూపులు సంయుక్తంగా ఫ్రాంచైజీని నిర్వహిస్తున్నాయి. రెండేళ్ల చొప్పున నిర్వహణ బాధ్యతలు పంచుకునే ఈ సంస్థల్లో జీఎంఆర్ పదవీకాలం 2026లో ముగిసింది.

ప్రపంచకప్ టికెట్లకు 1.5 కోట్ల దరఖాస్తులు!

- 142 దేశాల నుంచి అభిమానుల ఆసక్తి
- 12 రోజుల్లోనే భారీ స్పందన
- నవంబరు 21వరకు టికెట్ బాలెట్ నమోదు

దుబాయ్: 2027 వన్డే ప్రపంచకప్ టికెట్లకు భారీ స్పందన లభిస్తోంది. టికెట్ బాలెట్ ప్రక్రియ ప్రారంభమైన 12 రోజుల్లోనే 142 దేశాల నుంచి 1.5 కోట్లకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) మంగళవారం వెల్లడించింది. మొత్తం 1,50,83,752 టికెట్ దరఖాస్తులు అందగా, అభిమానుల నుంచి 44,23,417 బాలెట్ రిజిస్ట్రేషన్లు నమోదయ్యాయని తెలిపింది. 2027 అక్టోబరు 2 నుంచి నవంబరు 21 వరకు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా సంయుక్తంగా ఈ మెగా టోర్నీకి ఆతిథ్యమివ్వనున్నాయి. 24 ఏళ్ల విరామం తర్వాత ప్రపంచకప్ దక్షిణాఫ్రికాకు తిరిగి వస్తోంది. టికెట్ బాలెట్ నమోదు ప్రక్రియ నవంబరు 21, 2026 వరకు కొనసాగనుంది. సరిగ్గా ఏడాది తర్వాత జొహన్నెస్‌బర్గ్‌లోని వాండరర్స్ మైదానంలో ఫైనల్ జరగనుంది. ప్రపంచకప్‌పై ఉన్న ఆదరణ, ఆఫ్రికా పర్యాటక ఆకర్షణ, ఐసీసీతో పాటు భాగస్వామ్య సంస్థలు చేపట్టిన ప్రచార కార్యక్రమాల కారణంగానే ఈ స్థాయిలో స్పందన వచ్చిందని ఐసీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి సంజోగ్ గుప్తా పేర్కొన్నారు. టోర్నీకి ఏడాది సమయం ఉండడంతో అభిమానుల్లో ఉత్సాహాన్ని మరింత పెంచేందుకు వివిధ వేదికలపై ప్రచార కార్యక్రమాలు, ప్రత్యేక కంటెంట్‌ను అందించనున్నట్లు తెలిపారు.

సింధు, లక్ష్యసేన్ ఓటమి

ఒడెన్స్ (డెన్మార్క్): డెన్మార్క్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు పీవీ సింధు, లక్ష్యసేన్ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. మరోవైపు కిదాంబి శ్రీకాంత్, తన్వీ శర్మ పోరాడి గెలిచి రెండో రౌండ్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో సింధు 21–13, 23–25, 19–21తో జర్మనీకి చెందిన యెవోన్ లీ చేతిలో ఓడింది. గంటా ఐదు నిమిషాలపాటు సాగిన ఈ పోరులో తొలి గేమ్ గెలిచినా, తర్వాతి రెండు గేముల్లో ఓటమి తప్పలేదు. పురుషుల సింగిల్స్‌లో లక్ష్యసేన్ 18–21, 21–13, 15–21తో మూడో సీడ్ చైనీస్ తైపీ ఆటగాడు చౌ తియెన్ చెన్ చేతిలో పరాజయం పాలయ్యాడు. మరో మ్యాచ్‌లో శ్రీకాంత్ 22–20, 21–19తో ఫ్రాన్స్ ఆటగాడు ఆర్నాడ్ మెర్కెల్‌పై 46 నిమిషాల్లో విజయం సాధించాడు. 2017లో ఈ టోర్నీ టైటిల్ గెలిచిన శ్రీకాంత్.. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఏడో సీడ్ అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్)తో తలపడనున్నాడు. మహిళల సింగిల్స్‌లో తన్వీ శర్మ 21–17, 16–21, 21–19తో జపాన్ క్రీడాకారిణి నత్సుకి నిదైరాపై గెలిచింది. గంటా 12 నిమిషాలపాటు సాగిన ఈ పోరులో గట్టిగా పోరాడిన తన్వీ.. తదుపరి రౌండ్‌లో యెవోన్ లీతో తలపడనుంది. 9.5 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీతో సూపర్ 750 హోదాలో ఈ టోర్నీ జరుగుతోంది.

ఉప్పల్ మా అడ్డా: తిలక్ వర్మ

ప్రజానావ, ఉప్పల్: ఉప్పల్ స్టేడియం తమకు హోమ్ గ్రౌండ్ లాంటిదని టీమిండియా టీ20 వైస్ కెప్టెన్ తిలక్ వర్మ తెలిపాడు. వెస్టిండీస్‌తో ఐదు టీ20ల సిరీస్‌లో 2–1తో ఆధిక్యంలో ఉన్న భారత్ బుధవారం రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ స్టేడియంలో నాలుగో మ్యాచ్ ఆడనుంది. ఇప్పటికే హైదరాబాద్ చేరుకున్న ఇరు జట్లు మంగళవారం ముమ్మరంగా సాధన చేశాయి. ప్రాక్టీస్ అనంతరం తిలక్ మీడియాతో మాట్లాడాడు. తనతో పాటు ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డికి హైదరాబాద్ హోమ్ గ్రౌండ్ లాంటిదని, ఈ అనుభవం జట్టుకు ప్రయోజనం చేకూరుస్తుందని చెప్పాడు. ఇక్కడ మెరుగైన ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించేందుకు ప్రయత్నిస్తానన్నాడు. హైదరాబాద్ పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉంటుందని, ఈసారి వికెట్ మార్చినట్లు చెబుతున్నందున దాని స్వభావం ఎలా ఉంటుందో చూడాలని పేర్కొన్నాడు. ప్రస్తుతం జట్టు బ్యాటింగ్, బౌలింగ్‌లో దూకుడుగా ఆడుతోందని తెలిపాడు. మూడో టీ20లో దురదృష్టవశాత్తూ రనౌట్ అయ్యానని తిలక్ విచారం వ్యక్తం చేశాడు.

బోనస్ గెలుపు

- రంజీ ట్రోఫీ సీజన్‌ను ఘనంగా ఆరంభించిన హైదరాబాద్
- త్రిపురపై ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో విజయం
- మూడు రోజుల్లోనే ముగిసిన ఎలైట్ గ్రూప్–బి పోరు
- త్యాగరాజన్‌కు ఆరు.. సిరాజ్‌కు రెండు వికెట్లు

సికింద్రాబాద్: రంజీ ట్రోఫీ 2026–27 సీజన్‌ను హైదరాబాద్ జట్టు ఘన విజయంతో ప్రారంభించింది. ఎలైట్ గ్రూప్–బీ మ్యాచ్‌లో త్రిపురపై ఇన్నింగ్స్ 40 పరుగుల తేడాతో గెలుపొందింది. మంగళవారం మూడో రోజే మ్యాచ్ ముగిసింది. పేసర్లు తనయ్ త్యాగరాజన్ (6/52), మహమ్మద్ సిరాజ్ (2/19) చెలరేగడంతో ఓవర్‌నైట్ స్కోరు 99/7తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన త్రిపుర 120 పరుగులకే కుప్పకూలింది. ఈ విజయంతో హైదరాబాద్‌కు బోనస్ పాయింట్ సహా ఏడు పాయింట్లు లభించాయి. తొలి సెషన్‌లోనే ఓవర్‌నైట్ బ్యాటర్ సెంటు సర్కార్‌ను త్యాగరాజన్ పెవిలియన్‌కు పంపడంతో త్రిపుర పతనం వేగవంతమైంది. కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన ఆయన వరుస విరామాల్లో వికెట్లు తీసి ప్రత్యర్థిని దెబ్బతీశారు. మరోవైపు, దేశవాళీ క్రికెట్‌లోకి తిరిగొచ్చిన సిరాజ్ వేగం, నియంత్రణతో ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేశాడు. తొమ్మిది ఓవర్లలో 19 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు పడగొట్టాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ త్యాగరాజన్ కీలక పాత్ర పోషించడంతో హైదరాబాద్‌కు సమగ్ర విజయం దక్కింది. తదుపరి మ్యాచ్‌లో ఈ నెల 18 నుంచి ఆంధ్రతో హైదరాబాద్ తలపడనుంది.

ఇతర మ్యాచ్‌ల్లో..

విజయవాడలో జరిగిన మ్యాచ్‌లో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 418 పరుగులు చేయగా, కర్ణాటక మొదటి ఇన్నింగ్స్‌లో 274 పరుగులకే పరిమితమైంది. రెండో ఇన్నింగ్స్‌లో మూడో రోజు ఆట ముగిసే సమయానికి కర్ణాటక 4 వికెట్లకు 176 పరుగులు చేసింది. కరుణ్ నాయర్ 81, కెప్టెన్ రవిచంద్రన్ స్మరణ్ 21 పరుగులతో క్రీజులో ఉన్నారు. కర్ణాటకకు 32 పరుగుల ఆధిక్యం లభించింది. ఆంధ్ర బౌలర్ సౌరభ్ కుమార్ మూడు వికెట్లు తీశాడు. న్యూ చండీగఢ్‌లో అస్సోం తొలి ఇన్నింగ్స్‌లో 373 పరుగులు చేసింది. వర్షం అంతరాయం కలిగించిన మ్యాచ్‌లో పంజాబ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఐదు వికెట్లకు 287 పరుగులు చేసింది. ఓపెనర్ విహాన్ మల్హోత్రా 103 పరుగులతో శతకం సాధించాడు. పంజాబ్ ఇంకా 86 పరుగులు వెనుకబడి ఉంది.



సౌరాష్ట్రకు ఆధిక్యం

రాజ్‌కోట్‌లో సౌరాష్ట్ర తొలి ఇన్నింగ్స్‌లో 392 పరుగులు చేయగా, ఛత్తీస్‌గఢ్ 312 పరుగులకు ఆలౌటైంది. దీంతో సౌరాష్ట్రకు 80 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఛత్తీస్‌గఢ్ కెప్టెన్ అనుజ్ తివారీ 72, మయాంక్ వర్మ 68 పరుగులు చేశారు. రవీంద్ర జడేజా 40 పరుగులిచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర వికెట్ నష్టపోకుండా 45 పరుగులు చేసి, మొత్తం ఆధిక్యాన్ని 125 పరుగులకు పెంచుకుంది.

Business బిజినెస్

ఇన్ఫోసిస్ పనుల్లో సగం ఏఐ సేవలే!

- రెండు, మూడేళ్లలో కృత్రిమ మేధ సేవల వాటా భారీగా పెరుగుదల
- గత త్రైమాసిక ఆదాయంలో 8 శాతానికి పైగా వాటా
- ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 20వేల మంది నియామకాలు
- డేటా సెంటర్ల విస్తరణలో అధిక వ్యయాలు, సాంకేతిక మార్పులే సవాళ్లు
- సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ పరేఖ్



న్యూఢిల్లీ: ఇన్ఫోసిస్ మొత్తం పనుల్లో రెండు, మూడేళ్ల లో దాదాపు సగం ఏఐ సేవలే ఉండే అవకాశముందని సంస్థ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ పరేఖ్ తెలిపారు. గత త్రైమాసికంలో సంస్థ ఆదాయంలో ఏఐ సేవల వాటా 8శాతానికి మించిందని, ఈ విభాగం వేగంగా వృద్ధి చెందుతోందని చెప్పారు. ప్రస్తుత వేగం కొనసాగితే మరికొన్ని త్రైమాసికాల్లోనే మొత్తం పనుల్లో 20–30 శాతం వాటా ఏఐ సేవలదే కావచ్చని మంగళవారం బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరం–2026లో వెల్లడించారు. ఏఐ ఏజెంట్ల రూపకల్పన, కోడింగ్, పాత సాంకేతిక వ్యవస్థల ఆధునికీకరణ వంటి సేవలకు భారీ డిమాండ్ ఉందని పరేఖ్ తెలిపారు. ఏఐ అభివృద్ధి భారత ఐటీ సేవల రంగానికి మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. గతేడాది 20వేల మంది గ్రాడ్యుయేట్లను నియమించుకున్నామని, ఈ ఆర్థిక సంవత్సరంలో మరో 20వేల మందిని తీసుకోనున్నట్లు చెప్పారు. సంస్థలోని మూడు లక్షల మంది ఉద్యోగుల్లో ఇప్పటికే సుమారు 80వేల మంది కోడింగ్ సాధనాలపై పనిచేస్తున్నారని వెల్లడించారు.

వ్యయాలు, సామాజిక స్పందనపై ఆందోళన

ఏఐ సేవలకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో తక్కువ ఖర్చుతో పనిచేసే ఓపెన్ వెయిట్ నమూనాలపై సంస్థలు దృష్టి సారిస్తున్నాయని పరేఖ్ పేర్కొన్నారు. దేశీయ డేటా నిల్వ, క్లౌడ్ నిబంధనలు మౌలిక వసతుల విస్తరణకు అడ్డంకిగా మారుతున్నాయని చెప్పారు. డేటా సెంటర్ల నిర్మాణంలో చిప్‌ల అధిక ధరలు, పోటీ, భవిష్యత్తులో వాటి వినియోగంపై అనిశ్చితి సవాళ్లుగా ఉన్నాయని వివరించారు. కొత్త ఏఐ నమూనాలతో సమాచార విశ్లేషణ వ్యయాలు గణనీయంగా తగ్గవచ్చని, వాటి ప్రభావం ఐదేళ్ల నుంచి పదేళ్లలో కనిపించవచ్చని తెలిపారు. పాశ్చాత్య దేశాల్లో ఏఐ విస్తరణపై సామాజిక వ్యతిరేకత పెరిగే ప్రమాదం ఉందని, ఆర్థిక ప్రయోజనాలు, సామాజిక స్పందన మధ్య సమతుల్యత అవసరమని పేర్కొన్నారు.

టాటా ఎల్క్సీకి 10శాతం వృద్ధి

న్యూఢిల్లీ: డిజైన్, సాంకేతిక సేవల సంస్థ టాటా ఎల్క్సీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.170.30 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.154.82 కోట్లతో పోలిస్తే 10 శాతం వృద్ధి సాధించింది. కార్యకలాపాల ఆదాయం 14.98 శాతం పెరిగి రూ. 1,055.66 కోట్లకు చేరింది. అయితే, గత త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 3.4 శాతం పెరగ్గా, నికర లాభం 0.18 శాతం తగ్గింది. అనిశ్చిత అంతర్జాతీయ పరిస్థితుల్లోనూ వివిధ పరిశ్రమలు, ఖాతాదారుల నుంచి వృద్ధి సాధించామని సంస్థ సీఈఓ, ఎండీ మనోజ్ రాఘవన్ తెలిపారు. రవాణా విభాగం స్థిర కరెన్సీ ప్రాతిపదికన 2 శాతం వృద్ధి చెందిందని, తదుపరి తరం క్లౌడ్ ఆధారిత టెలిమాటిక్స్, అనుసంధానిత వాహన వ్యవస్థ అభివృద్ధికి ప్రముఖ ఆటో మొబైల్ సంస్థ నుంచి బహుళ సంవత్సరాల ఒప్పందం దక్కించుకున్నామని వెల్లడించారు. మీడియా, కమ్యూనికేషన్ల విభాగంలో 3.4 శాతం, ఆరోగ్య సంరక్షణ విభాగంలో 3.5 శాతం త్రైమాసిక వృద్ధి నమోదైందన్నారు.

ఏఐ పెట్టుబడుల్లో ఆచితూచి అడుగేయాలి

- రాబడుల ఆధారంగానే నిర్ణయాలు తీసుకోవాలి
- పోటీలో వెనుకబడతామనే భయంతో పరుగులు వద్దు
- వ్యాపార అవసరాలకు అనుగుణంగా ఏఐ వినియోగం
- ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా




న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ)లో పెట్టుబడులు పెట్టేటప్పుడు పోటీలో వెనుకబడతామనే భయంతో కాకుండా వాటి ద్వారా వచ్చే రాబడులను బట్టి నిర్ణయాలు తీసుకోవాలని ఆదిత్య బిర్లా గ్రూప్ చైర్మన్ కుమార మంగళం బిర్లా సూచించారు. ఏఐ కోసం కంప్యూటింగ్ సామర్థ్యం, ప్రతిభను సమకూర్చుకునే పోటీ నుంచి సంస్థలు బయటపడి.. పెట్టుబడుల ద్వారా ఎంత ప్రయోజనం పొందవచ్చనే అంశంపై దృష్టి సారిస్తున్నాయని చెప్పారు. ఏడాది క్రితం అనుకున్నదానితో పోలిస్తే ఏఐ పెట్టుబడుల విషయంలో తమ గ్రూప్ ఆచితూచి ముందుకెళ్తుందని మంగళవారం 2026 బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరంలో వెల్లడించారు. ఏఐలో పెట్టుబడులు భారీ మొత్తాలతో కూడుకున్నందున, తప్పనిసరిగా ఇప్పుడే పెట్టుబడులు పెట్టాలనే ఒత్తిడికి లోనుకావాల్సిన అవసరం లేదన్నారు. వివిధ రంగాల్లో ఏఐ వినియోగం భిన్నంగా ఉంటుందని బిర్లా తెలిపారు. వినియోగదారులతో సంబంధాల మెరుగుదల, తయారీ సామర్థ్యం పెంపు, ఆర్థిక సేవల్లో నికర వడ్డీ మార్జిన్ల మెరుగుదలకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. అనేక రంగాల్లో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు ఒకే విధానం సరిపోదని, మొత్తం సంస్థ ఉత్పాదకతపై ఏఐ ప్రభావాన్ని ఇంకా అంచనా వేస్తున్నామని పేర్కొన్నారు. వస్త్ర సరఫరా వ్యవస్థలో పారదర్శకత కోసం తమ గ్రూప్ బ్లాక్‌చెయిన్ సాంకేతికతను వినియోగిస్తోందని, లేబుల్ స్కాన్ చేయడం ద్వారా వస్త్రాల్లో ఉపయోగించిన పత్తి లేదా విస్కోస్ మూలాలను గుర్తించవచ్చని వివరించారు.

ప్రపంచ పరిణామాల ప్రభావం

ప్రస్తుత పరిస్థితుల్లో ఇప్పటికే ఉన్న వ్యాపారాల్లో పెట్టుబడులు కొనసాగిస్తూనే కొత్త అవకాశాలకు నిధులు కేటాయించడం సవాల్‌గా మారిందని బిర్లా చెప్పారు. వృద్ధిని ఆపలేమని, అలా చేస్తే వెనుకబడిపోతామని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నందున ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిణామాలు తమ వ్యాపారాలపై ప్రభావం చూపుతాయని తెలిపారు. ఉద్యోగుల్లో ఉత్సాహం, విభాగాల మధ్య సహకారం, నిరంతర శిక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. తయారీ రంగంలో వ్యయ నియంత్రణ, ఉత్పత్తి సామర్థ్యం, స్థిరమైన కార్యకలాపాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా అత్యల్ప వ్యయంతో ఉత్పత్తి చేసే తొలి 10 శాతం సంస్థల్లో నిలవడమే తమ లక్ష్యమని చెప్పారు. ఆదిత్య బిర్లా గ్రూప్ 41 దేశాల్లో 20కి పైగా రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. 2.27 లక్షల మందికి పైగా ఉద్యోగులు, 600కుపైగా తయారీ యూనిట్లు కలిగిన ఈ గ్రూప్ 2025–26లో సుమారు 72 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని, 8.5 బిలియన్ డాలర్ల ఈబీఐటీడీఏను నమోదు చేసింది. గ్రూప్ సిమెంట్ ఉత్పత్తి సామర్థ్యం ఈ ఏడాది 200 మిలియన్ టన్నులకు చేరగా, చైనా వెలుపల ప్రపంచంలోనే అతిపెద్ద సిమెంట్ సంస్థగా నిలిచింది. సిమెంట్ వ్యాపారానికి రెండు గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యాన్ని జోడించింది.

మార్కెట్లకు భారీ జోష్

- 1,109 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్.. 22,721 వద్ద ముగిసిన నిఫ్టీ
- ఐటీ షేర్ల ర్యాలీతో భారీ లాభాలు



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా పుంజుకున్నాయి. ఐటీ, బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ షేర్లలో కొనుగోళ్లు, రూపాయి రికవరీ, ఎల్‌టీసీజీ, ఎస్‌టీటీపై చర్చకు సిద్ధమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన వ్యాఖ్యలు మార్కెట్లకు ఊతమిచ్చాయి. మంగళవారం సెన్సెక్స్ 1,109.10 పాయింట్లు (1.54 శాతం) పెరిగి 73,033.78 వద్ద, నిఫ్టీ 358.60 పాయింట్లు (1.60 శాతం) లాభంతో 22,721.95 వద్ద ముగిసింది. నాలుగు నెలల్లో సెన్సెక్స్‌కు ఇదే అత్యుత్తమ లాభం. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ 8.28 శాతం, టీసీఎస్ 6.59 శాతం, టెక్ మహీంద్రా 4.90 శాతం, ఇన్ఫోసిస్ 4.44 శాతం చొప్పున పెరిగాయి. హెచ్‌సీఎల్ రెండో త్రైమాసికంలో నికర లాభాన్ని 21.18 శాతం పెంచుకుని రూ.5,132 కోట్లకు చేర్చడం ఐటీ షేర్లకు బలాన్నిచ్చింది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు కూడా లాభపడ్డాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి 41 పైసలు బలపడి రూ.95.37 కు చేరగా, బ్రెంట్ ముడిచమురు ధర 1.66 శాతం తగ్గి బ్యారెల్‌కు 104.6 డాలర్లకు పడిపోయింది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి 5.46 శాతం నష్టపోగా, షాంఘై, హాంగ్‌కాంగ్ సూచీలు లాభపడ్డాయి. సోమవారం విదేశీ సంస్థాగత మదుపర్లు రూ. 1,708.48 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.

ఎల్ఐసీ నుంచి మరో మూడు కొత్త పథకాలు

- పదవీ విరమణ తర్వాత హామీతో కూడిన ఆదాయం
- కుటుంబ సభ్యులందరికీ ఆరోగ్య బీమా రక్షణ
- క్యాన్సర్ నిర్ధారణపై ఏకమొత్తంలో ఆర్థిక ప్రయోజనం



న్యూఢిల్లీ: భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) మరో మూడు కొత్త బీమా పథకాలను మంగళవారం ప్రారంభించింది. న్యూ జీవన్ ధారా–2, హెల్త్ షీల్డ్, న్యూ క్యాన్సర్ కవర్ పేర్లతో వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. పదవీ విరమణ తర్వాత ఆర్థిక భద్రత కల్పించడం, కుటుంబ ఆరోగ్య అవసరాలకు రక్షణ అందించడం, క్యాన్సర్ చికిత్స సమయంలో ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం ఈ పథకాల లక్ష్యమని సంస్థ వెల్లడించింది. న్యూ జీవన్ ధారా–2 పథకం వ్యక్తిగత పొదుపు, వాయిదా వార్షిక ఆదాయ పథకం. పదవీ విరమణ తర్వాత హామీతో కూడిన ఆదాయం ద్వారా ఆర్థిక స్వతంత్రత కల్పిస్తుంది. హెల్త్ షీల్డ్ పథకం కుటుంబ సభ్యులందరికీ సమగ్ర ఆరోగ్య బీమా రక్షణ కల్పిస్తుంది. పాలసీ కాలవ్యవధి అంతటా ప్రీమియం స్థిరంగా ఉంటుంది. ఆసుపత్రిలో చేరినప్పుడు రోజువారీ నగదు ప్రయోజనంతో పాటు, ప్రధాన శస్త్ర చికిత్సలు, తీవ్రమైన వ్యాధుల సందర్భాల్లో ఏకమొత్తంలో చెల్లింపులు అందిస్తుంది.

క్యాన్సర్ నిర్ధారణపై ఆర్థిక సాయం

న్యూ క్యాన్సర్ కవర్ పథకం కింద నిర్దిష్ట ప్రారంభ, తీవ్ర దశల క్యాన్సర్ నిర్ధారణ జరిగినప్పుడు చికిత్సకు అయిన వాస్తవ ఖర్చుతో సంబంధం లేకుండా నిర్ణీత ఆర్థిక ప్రయోజనం అందుతుంది. వయోపరిమితి నిబంధనల ఆధారంగా కనీస బీమా మొత్తం రూ.15 లక్షల నుంచి రూ.35 లక్షల వరకు ఉంటుంది. ఈ పథకం కింద ఇప్పటికే ఉన్న పాలసీలను కలిపి గరిష్ఠ బీమా మొత్తం రూ.50 లక్షలుగా నిర్ణయించినట్లు ఎల్ఐసీ తెలిపింది.



వైష్ణవి చైతన్య ఆశలన్నీ ఆ తమిళ సినిమాపైనే!

'బేబీ' సినిమాతో టాలీవుడ్‌లో యూత్ ఫేవరెట్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న వైష్ణవి చైతన్య.. ఆ తర్వాత నటించిన చిత్రాలతో ఆశించిన స్థాయిలో విజయాలను అందుకోలేకపోయింది. ఇటీవల విడుదలైన 'ఎపిక్: ది ఫస్ట్ సెమిస్టర్' కూడా బాక్సాఫీస్ వద్ద అంచనాలను అందుకోలేకపోయింది. దీంతో ఈసారి కోలీవుడ్ సినిమాతో సత్తా చాటాలని ఈ భామ ఆశిస్తోంది. వైష్ణవి చైతన్య, ఆర్య, నిఖిలా విమల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'హలో ప్రేమ'. తమిళంలో 'హలో కాదల్' పేరుతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి నిఖిల్ మురళి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా అధికారిక టైటిల్ టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'దారి ఇవ్వండి.. ప్రేమ వచ్చేస్తోంది. మిమ్మల్ని మాట్లాడేలా.. మనసు విప్పి చెప్పేలా చేసే ఓ కథ..' అంటూ విడుదల చేసిన టీజర్ పోస్టర్ నెట్టింట సందడి చేస్తోంది. ప్రేమకథా చిత్రంగా ఆసక్తిని రేకెత్తిస్తున్న ఈ సినిమా టైటిల్ టీజర్ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇదే క్రమంలో చిత్రాన్ని ఈ ఏడాది డిసెంబర్ 4న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కాగా, వైష్ణవి చైతన్యకు తమిళ చిత్ర పరిశ్రమతో ఇదే తొలి పరిచయం కాదు. గతంలో అజిత్ నటించిన 'వాలిమై' సినిమాలో ఆమె కనిపించింది. అయితే, హీరోయిన్‌గా నటిస్తున్న తొలి తమిళ చిత్రం మాత్రం 'హలో ప్రేమ' కావడంతో ఈ సినిమాపై వైష్ణవి భారీ ఆశలు పెట్టుకుంది. కోలీవుడ్‌లో ఈ చిత్రం ఆమెకు ఎలాంటి గుర్తింపును తీసుకొస్తుందో చూడాలి.



యంగ్

హీరోయిన్ అనన్య పాండేకు అరుదైన అవకాశం దక్కింది. ఇప్పటికే పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. తాజాగా ప్రతిష్ఠాత్మక ఐఫా అవార్డ్స్ 2027 వేడుకకు సహ–హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఆమె.. ఇప్పుడు తొలిసారిగా అవార్డుల వేడుకను హోస్ట్ చేసేందుకు సిద్ధమవుతున్నారు. నటిగా తనదైన అభినయంతో అభిమానులను ఆకట్టుకున్న అనన్య.. ఈ కొత్త బాధ్యత పట్ల ఎంతో సంతోషంగా ఉన్నారు. ఈ సందర్భంగా ఐఫా వేడుకతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు. ఐఫా వేడుకలో భాగం కావడం తనకు ఎప్పుడూ ప్రత్యేకమేనని అనన్య తెలిపారు. అబుదాబీలోని యాస్ ఐలాండ్‌లో ఉన్న ప్రతిష్ఠాత్మక వేదికపైనే తొలిసారిగా స్టేజ్ పెర్ఫార్మెన్స్ ఇచ్చానని, ఆ సమయంలో కలిగిన ఉత్సాహం ఇప్పటికీ తన మనసులో అలాగే ఉందని

ఐఫా-2027 వేడుకకు అనన్య పాండే సహ-హోస్ట్

గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి నుంచి టీవీలో ఐఫా అవార్డులను చూస్తూ పెరిగిన తనకు.. భారతీయ సినిమా రంగానికి చెందిన ప్రముఖులంతా ఒకచోట చేరే ఈ వేడుకలో భాగం కావడం కల నిజమైన అనుభూతిని ఇచ్చిందని పేర్కొన్నారు. కాలక్రమేణా ఐఫా తన సినీ ప్రయాణంలో ఒక అందమైన భాగంగా మారిందని చెప్పారు. ఈ వేడుకల ద్వారా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని, కెరీర్‌లో ఎదగడంతో పాటు తనలోని కొత్త నైపుణ్యాలను ప్రదర్శించేందుకు మంచి అవకాశాలు లభించాయని వెల్లడించారు. ఎప్పటికీ గుర్తుండిపోయే మధురమైన జ్ఞాపకాలను ఐఫా తనకు అందించిందని అనన్య పేర్కొన్నారు. ఐఫా వేదికపై కనిపించే ఉత్సాహం, ప్రేక్షకుల కేరింతలు, సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖుల సందడి.. ఈ వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఐఫా అవార్డ్స్ 2027కు సహ–హోస్ట్‌గా వ్యవహరించే అవకాశం రావడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తోందని తెలిపారు. మరోసారి అదే వేదికపైకి వెళ్లి భారతీయ సినిమా రంగంలోని గొప్ప నటీనటులను, అద్భుతమైన కథలను, విజయాలను అందరితో కలిసి వేడుకగా జరుపుకునేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని అనన్య పాండే వెల్లడించారు.

కన్నడ

బుల్లితెరపై తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి ఐశ్వర్య.. తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితమే. ముఖ్యంగా 'అగ్నిసాక్షి' సీరియల్‌తో విశేషమైన ఆదరణ సంపాదించుకున్న ఆమె.. తాజాగా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి కీలక ప్రకటన చేశారు. భర్త హరి వినయ్‌తో విడాకులు తీసుకున్నట్లు వెల్లడించి అభిమానులకు షాకిచ్చారు. నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న సమయంలోనే మైసూరుకు చెందిన హరి వినయ్‌ను ప్రేమించి 2019లో వివాహం చేసుకున్నారు ఐశ్వర్య. కొంతకాలం పాటు వీరి వైవాహిక జీవితం సాఫీగా సాగినప్పటికీ, ఆ తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో విడిపోయారంటూ గత కొంతకాలంగా వార్తలు ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా స్పందించిన ఐశ్వర్య.. తమ విడాకుల విషయాన్ని అధికారికంగా వెల్లడించారు. తమ వ్యక్తిగత జీవితంపై వస్తున్న అనవసరమైన ఊహాగానాలకు ముగింపు పలకాలనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని బయటపెడుతున్నట్లు తెలిపారు. గత ఏడాదిన్నర కాలంగా తామిద్దరం వేర్వేరుగా ఉంటున్నామని, ఎంతో ఆలోచించిన తర్వాత ఇరువురి పరస్పర అంగీకారంతో విడాకులు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఇది పూర్తిగా తమ వ్యక్తిగత నిర్ణయమని పేర్కొన్నారు. ఈ క్లిష్ట సమయంలో తమ వ్యక్తిగత స్వేచ్ఛను, మనశ్శాంతిని గౌరవించాలని అభిమానులు, శ్రేయోభిలాషులను కోరారు. కేవలం వీక్షణలు, ఇష్టాలు, అనుచరుల సంఖ్య పెంచుకోవడం కోసం తప్పుడు వార్తలు, వీడియోలు ప్రచారం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఆధారాలు లేని ఆరోపణలు చేయడం, సీరియళ్లలోని సన్నివేశాలను సందర్భానికి సంబంధం లేకుండా ఉపయోగించి తమ వ్యక్తిగత జీవితంపై కథనాలు రూపొందించ డం సరికాదని అన్నారు. ఇలాంటి చర్యలు చట్టపరమైన పరిణామాలకు దారితీయవచ్చని హెచ్చరించారు. తన గురించి తప్పుడు వార్తలు ప్రచారం చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటానని ఐశ్వర్య స్పష్టం చేశారు. దీంతో ఆమె చేసిన ప్రకటన ఇప్పుడు బుల్లితెర వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



డిసెంబర్ 4న 'ట్రైన్' థియేటర్లలోకి

తెలుగు, తమిళ భాషలతో సంబంధం లేకుండా ప్రేక్షకుల్లో విశేషమైన అభిమానగణాన్ని సంపాదించుకున్న కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ సేతుపతి వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. ఈ క్రమంలో ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'ట్రైన్' ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతోంది. కోలీవుడ్ ప్రముఖ దర్శకుడు మిస్కిన్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ డార్క్ థ్రిల్లర్ నుంచి ఇప్పటికే విడుదలైన అప్‌డేట్స్ సినిమాపై అంచనాలను పెంచాయి. తాజాగా చిత్రబృందం మరో కీలక ప్రకటన చేసింది. సినిమా విడుదల తేదీని వెల్లడిస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. 'ప్రయాణానికి సిద్ధమవ్వండి.. ట్రైన్ ప్రపంచవ్యా ప్తంగా డిసెంబర్ 4న థియేటర్లలోకి దూసుకురా నుంది' అంటూ ప్రకటించింది. వీ క్రియేషన్స్ బ్యానర్‌పై కలైపులి ఎస్. థాను ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో శ్రుతిహాసన్, నాజర్, దివ్య శర్మ, జయరామ్, వినయ్ రాయ్, నరైన్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యాక్షన్, ఉత్కంఠ, చీకటి ఛాయలతో కూడిన కథనంతో తెరకెక్కుతున్న ఈ సినిమా విజయ్ సేతుపతి అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. డిసెంబర్ 4న ప్రేక్షకుల ముందుకు రానున్న 'ట్రైన్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి స్పందనను అందుకుంటుందో చూడాలి.

తప్పుడు వార్తలు ప్రచారం చేయొద్దు

బిగ్‌బాస్ హౌస్‌లో హైడ్రామా!



బిగ్‌బాస్ తెలుగు సీజన్ 10లో ఆరో వారం ఆట మరింత ఉత్కంఠగా మారింది. వైల్డ్ కార్డ్ ఎంట్రీలతో హౌస్‌లో కొత్త సమీకరణాలు మొదలవగా.. నామినేషన్స్ ప్రక్రియలో కంటెస్టెంట్ల మధ్య వాగ్వాదాలు తారస్థాయికి చేరాయి. దశావతారంలో భాగంగా ఈ వారం 'రోడ్ బ్లాక్' ఉంటుందని నాగార్జున ఇప్పటికే ప్రకటించడంతో పోటీ మరింత ఆసక్తికరంగా మారింది. తొలుత వైల్డ్ ఫైర్ కంటెస్టెంట్ శివకు ఇద్దరిని ఎంపిక చేసే అవకాశం దక్కగా.. అతడు త్రిగుణ్, రోహిత్‌లను ఎంచుకున్నాడు. ఈ పోటీలో రోహిత్ విజయం సాధించి ఝాన్సీ, టెంపర్ వంశీలను నామినేట్ చేశాడు. దీంతో వారిమధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వైల్డ్ ఫైర్ కంటెస్టెంట్ నీతు.. అమన్, ముఖేష్‌లను ఎంపిక చేయగా, ఈ పోటీలో ముఖేష్ గెలిచి అమన్, షాలినిలను నామినేట్ చేశాడు. ఆటలో సరిగ్గా ఆడలేదనే విమర్శలతో మొదలైన మాటల యుద్ధం క్రమంగా పెద్ద గొడవకు దారితీసింది. ఈ క్రమంలో రోహిత్ జోక్యం చేసుకుని ముఖేష్ ప్రవర్తనలో మెచ్యూరిటీ కనిపించడం లేదని వ్యాఖ్యానించగా.. అమన్ కూడా అతడికి కౌంటర్ ఇచ్చాడు. దీంతో ముఖేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ డాన్‌లా ఫీల్ కావొద్దంటూ ఘాటుగా స్పందించాడు. మరోవైపు, పజిల్ టాస్క్‌లో సరైన ప్రయత్నం చేయలేదంటూ షాలినిని నామినేట్ చేయడంతో ఆమె కూడా ఎదురుదాడికి దిగింది. మీ ఆటలోనే డ్రాయింగ్ ప్రయత్నాలు కనిపించడం లేదంటూ రివర్స్ కౌంటర్ ఇచ్చింది. ఈ వివాదంలోకి త్రిగుణ్ ఎంట్రీ ఇవ్వడంతో పరిస్థితి మరింత వేడెక్కింది. త్రిగుణ్, షాలిని మధ్య మాటామాటా పెరగగా.. అమన్ జోక్యం చేసుకోవడంతో గొడవ మరో మలుపు తిరిగింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసు కుని, కొట్టుకునే పరిస్థితి వరకు వెళ్లింది. గతంలోనే రోహిత్, త్రిగుణ్, అమన్‌లకు నాగార్జున ఎల్లో కార్డులు ఇచ్చి హెచ్చరిం చినప్పటికీ వారి ప్రవర్తనలో మార్పు కనిపించలేదనే చర్చ మొదలైంది. మరోసారి హద్దులు దాటి మాట్లాడితే ఇంటి నుంచి బయటకు పంపిస్తానని నాగార్జున హెచ్చరించిన నేపథ్యంలో.. ఈ వారం వీకెండ్ ఎపిసోడ్‌లో ఆయన ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది. నిజంగానే ఈ ముగ్గురిపై కఠిన చర్యలు తీసుకుంటారా? అన్న ఉత్కంఠ ప్రేక్షకుల్లో నెలకొంది. మొత్తానికి ఈ వారం నామినేషన్ల ప్రక్రియ ముగిసే సమయానికి ఝాన్సీ, వంశీ, అమన్, వర్షిణి డేంజర్ జోన్‌లో ఉన్నట్లు సమాచారం. వీరిలో ఎవరు ఎలిమినేట్ అవుతారన్నది తదుపరి ఎపిసోడ్‌లో తేలనుంది.

కోలీవుడ్‌లో అదృష్టాన్ని పరీక్షించుకోనున్న పూజిత పొన్నాడ



తెలుగు అమ్మాయిగా సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి, టాలీవుడ్‌లో పలు చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యువ కథానాయిక పూజిత పొన్నాడ.. ఇప్పుడు తమిళ చిత్ర పరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమవుతోంది. సరైన విజయాన్ని అందుకోలేక స్టార్ హీరోయిన్‌గా ఎదగలేకపోయిన ఈ భామ.. తాజాగా సస్పెన్స్ థ్రిల్లర్ 'సిగ్నల్ ఎట్ 11:30'తో ప్రేక్షకులను పలకరించ నుంది. సంతోష్ ప్రతాప్, భవ్య త్రిఖ మద్దెల ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి మలర్విళి నాటేసన్ రచనతో పాటు దర్శకత్వం వహిస్తున్నారు. డి. ఇమ్మాన్ సంగీతం అందిస్తుండగా.. అలార్ స్టూడియోస్ పతాకంపై మలర్విళి నాటేసన్, శివాని సుబ్రమణి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను అక్టోబర్ 30న థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న పూజిత.. ఈ సినిమాతో కోలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకో వాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. దర్శకురాలు మలర్విళి కథ చెప్పగానే తనకు ఎంతో నచ్చిందని తెలిపింది. మహిళా దర్శకులు మహిళా పాత్రలను మరింత భావోద్వేగభరితంగా, అందంగా తెరపై ఆవిష్కరించ గలరని అభిప్రాయ పడింది. ఇక నిజ జీవితంలో డ్రైవింగ్ అంటే భయపడే తనతో.. అర్ధరాత్రి వేళ, ట్రాఫిక్ లేని రహదారులపై ఉత్కంఠభరితమైన కార్ ఛేజ్ సన్నివేశాలను చిత్రీకరించారని పూజిత వెల్లడించింది. మొదట భయంగా అనిపించినప్పటికీ, ఆ అనుభవమే ఇప్పుడు తనకు ఎంతో ఇష్టమైన జ్ఞాపకంగా మిగిలిపో యిందని చెప్పుకొ చ్చింది. హిల్ స్టేషన్ నేపథ్యంలో సాగే రొమాంటిక్ సన్నివేశాలు ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని పేర్కొంది. సహనటుడు సంతోష్ ప్రతాప్‌తో కలిసి పనిచేయడం చాలా సౌకర్యం గా అనిపించిందని తెలిపింది. అలాగే, కొన్నేళ్ల క్రితం ఓ ప్రకటనలో కలిసి పనిచేసిన భవ్య త్రిఖాతో మళ్లీ ఈ సిని మా ద్వారా కలిసి నటించడం సంతో షంగా ఉందని పూజిత పొన్నాడ వెల్లడించింది. మరి 'సిగ్నల్ ఎట్ 11:30'తో ఈ తెలు గు భామ తమిళ ప్రేక్షకులను ఏ మేరకు ఆకట్టు కుం టుందో చూడాలి.

బాలయ్య అలా అనేసరికి ఏడ్చేశా

ఒకప్పుడు తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న అలనాటి హీరోయిన్ లయ.. ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్‌పై దృష్టి సారించింది. వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుంటూ మరోసారి నటిగా బిజీ కావాలని ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. నందమూరి నటసింహం బాలకృష్ణతో కలిసి పనిచేసిన అనుభవా లను పంచు కుంది. బాలకృష్ణకు నిజంగానే అంత కోపమా? అనే ప్రశ్నకు ఆసక్తికర సమాధాన మిచ్చింది. బాలయ్యతో సినిమా చేయడానికి ముందు ఆయనకు కోపం ఎక్కువనే ప్రచారం విని కొంత భయపడేదాన్నని లయ తెలిపింది. అయితే, ఆయనతో కలిసి పనిచేశాక ఎంతో సరదాగా, ఆప్యాయంగా ఉంటారని అర్థమైందని చెప్పుకొచ్చింది. బాలకృష్ణతో కలిసి 'విజయేంద్ర వర్మ' సినిమాలో నటించిన సమయంలో జరిగిన ఓ సంఘటనను గుర్తుచేసుకుంది. ఓ పాట చిత్రీకరణలో భాగంగా డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు పొరపాటున బాలకృష్ణ కాలిపై కాలు వేశానని తెలిపింది. దీంతో బాలకృష్ణ ప్యాకప్ చెప్పి, తనను సినిమా నుంచి తీసేయమన్నట్లుగా సరదాగా మాట్లాడారని వెల్లడించింది. ఆయన మాటలు నిజమేనని భావించి తాను భయంతో ఏడ్చేశానని చెప్పింది. తన పరిస్థితిని గమనించిన బాలకృష్ణ వెంటనే నవ్వుతూ.. 'సరదాగా అన్నాను.. నిజమనుకోవద్దు' అని చెప్పడంతో ఊపిరి పీల్చుకున్నానని లయ వివరించింది. బాలకృష్ణతో కలిసి పనిచేసిన అనుభవం తనకు మధురమైన జ్ఞాపకంగా మిగిలిపోయిందని లయ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సినీ అభిమానుల్లో ఆసక్తిని కలిగిస్తున్నాయి.



దళపతి విజయ్‌తో విజయ్ దేవరకొండ భేటీ

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ.. కోలీవుడ్ అగ్ర కథానాయకుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత దళపతి విజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ ప్రత్యేక భేటీకి సంబంధించిన విశేషాలను, విజయ్‌పై తనకున్న అభిమానాన్ని వెల్లడిస్తూ విజయ్ దేవరకొండ సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా భావోద్వేగపూరితమైన పోస్టును పంచుకున్నారు. రోజంతా ఎంతో బిజీగా ఉన్నప్పటికీ విజయ్ సర్ తమను ఎంతో ప్రేమగా ఆహ్వానించారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జీవితం, సినీ ప్రయాణం, సమాజం వంటి పలు అంశాలపై దళపతి విజయ్ ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారని పేర్కొన్నారు. ఆయనతో కొద్దిసేపు గడపడమే తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతిని ఇచ్చిందని విజయ్ దేవరకొండ వెల్లడించారు. ఒక్క భేటీతోనే విజయ్ సర్ తనకు అత్యంత ఆప్తుడిగా మారిపోయారని, ఆయనపై తనకున్న ప్రేమ, గౌరవం ఎప్పటికీ అలాగే ఉంటాయని భావోద్వేగంగా పేర్కొన్నారు. ఈ ఇద్దరు ప్రముఖ హీరోల సమావేశానికి సంబంధించిన ఫొటోలతో పాటు విజయ్ దేవరకొండ చేసిన పోస్టు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇద్దరు హీరోల అభిమానులు ఈ భేటీపై ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తమ అభిమాన నటులు ఒకచోట కలవడంతో ఈ సమావేశానికి సంబంధించిన ఫొటోలు, విశేషాలను ఆసక్తిగా పంచుకుంటున్నారు.



వజ్రాల వేట.. పల్లెటూరి ప్రేమకథ

రాయలసీమలోని జొన్నగిరి ప్రాంతం.. వర్షం కురిసిన తర్వాత నేలపై వజ్రాలు దొరుకుతాయనే నమ్మకంతో అక్కడి ప్రజలు పొలాల్లో వెతుకులాట సాగిస్తుంటారు. ఈ ఆసక్తికరమైన నేపథ్యాన్ని ఆధారంగా చేసుకుని, పల్లెటూరి వాతావరణంలో సాగే స్వచ్ఛమైన ప్రేమకథగా తెరకెక్కుతున్న చిత్రం 'జో జో'. దర్శకుడు దేవా కట్టా సమర్పణలో కిరణ్ జయ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో కృష్ణ కమల్, మహి జంటగా నటిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి 'జోజో కాషన్' పేరుతో ప్రత్యేక గ్లింప్స్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ వీడియోలో జొన్నగిరి ప్రాంతంలోని గ్రామీణ జీవనశైలి, వర్షం తర్వాత పొలాల్లో వజ్రాల కోసం వెతికే సన్నివేశాలు ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో హీరో చేసే సరసానికి హీరోయిన్ ఘాటుగా స్పందించడం, దాన్ని తన స్నేహితుడి దగ్గర హీరో సరదాగా సమర్థించుకునే ప్రయత్నం చేయడం నవ్వులు పూయిస్తోంది. గ్రామీణ నేపథ్యానికి ప్రేమ, హాస్యాన్ని జోడిస్తూ తెరకెక్కుతున్న ఈ రస్టిక్ రొమాంటిక్ డ్రామా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందించేందుకు సిద్ధమవుతోంది. తాజాగా విడుదలైన గ్లింప్స్‌తో సినిమాపై ఆసక్తి పెరుగుతోంది. మరి వెండితెరపై 'జో జో' ఎలాంటి వినోదాన్ని పంచుతుందో చూడాలి.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.